జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 3 పక్షపత్రిక ఫిబ్రవరి 1- 15, 2016

## భవిష్యత్తును వణికిస్తున్న కాంబినేషన్...



- రాతియుగపు భావోద్రేకాలు
- మధ్యయుగపు రాజకీయం - తాత్కాలిక ధోరణులు
- అరచేతిలో స్వర్గం చూపుతున్న టెక్నాలజీ

రోహిత్ ఆత్మహత్యపై హెచ్‌సీయూలో
విద్యార్థులకు జేపీ సంఘీభావం



# యువత తమ ఆవేశాన్ని, ఆలోచనల్ని 'అందరికీ సమాన విద్య' తో కుల రహిత సమాజం వైపు తీసుకెళ్లాలి: జేపీ

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యపై క్యాంపస్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులను లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పరామర్శించి సంఘీభావం తెలిపారు.

రోహిత్ తల్లికి క్షమాపణలు చెబుతూ జేపీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

"ఏ తల్లి గర్భాన పుట్టిన కారణంగా ఎదిగే సమాజం వస్తుందని, తన బిడ్డ రోహిత్‌కూ మంచి జీవితం లభిస్తుందని ఎన్నో ఆశలతో ఎదురుచూసిన అతని తల్లి రాధికకు ఈ సమాజం తరపున క్షమాపణ చెబుతున్నాను. పుట్టుకతో వివక్ష మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్న ఈ సమాజంలో నేనూ భాగం కాబట్టే ఈ క్షమాపణ. ఆత్మహత్యలకు నేను పూర్తి వ్యతిరేకిని. ఇప్పుడు రోహిత్ వేముల ఆత్మహత్యను కూడా సమర్థించను. కానీ రోహిత్ రాసిన అసాధారణ లేఖను చూశాక, 2002, మార్చి 3న కూడా ఇలాంటి ఘటనే జరిగినా సరైన చర్యలు లేవని తెలిశాక... తప్పనిసరిగా రావాలనుకుని వచ్చాను. అది కూడా రాజకీయ పార్టీ తరపున కాదు. విశ్వవిద్యాలయంలో ఇంత వివాదం జరుగుతూ విద్యార్థులు తెలిసోతెలియకో నలిగిపోతుంటే, వాళ్లంతా మన బిడ్డలే అనుకుని అండగా నిలిచి పరిస్థితిని చక్కదిద్దాలనే బుద్ధి వైస్ ఛాన్సలర్, ఇతర అధ్యాపకులకు ఉండక్కర్లా? రోహిత్, మిత్రబృందం దాడి ఆరోపణలపై నివేదికల్ని చూస్తే.. గెలిచిన నేతలు పార్టీలు మార్చినంత తేలిగ్గా ఓ ప్రొఫెసర్ నివేదికల్లోని అంశాల్ని మార్చేసి రాశారు. దేశం మొత్తం ఇక్కడికి వచ్చి చూస్తుంటే, కన్న తల్లిదండ్రుల్లాంటి అధ్యాపకులు మాత్రం ఎలా తప్పించుకోవాలో ఆలోచిస్తున్నారు. రోహిత్ విషయంలో కుల ప్రస్తావన వస్తోంది. కులాన్ని బట్టి న్యాయాన్యాయాలను అంచనా వేస్తారా? గాంధీ, అంబేద్కర్, బోస్, నెహ్రూ, పటేల్ తదితర నేతల మధ్య విభేదాలున్నా, స్వతంత్ర్య పోరాట తుదిదశలో, ఆ తర్వాత ఓ ఇరవయ్యేళ్ల పాటు వివక్షలు లేని దేశాన్ని నిర్మించాలనే ప్రయత్నం చిత్తశుద్ధితో జరిగింది. మేం చదువుకునే రోజుల్లో కూడా కులాల గురించి మాట్లాడటాన్ని అనాగరికంగా భావించేవారు. కానీ గత 30 ఏళ్లలో కులాన్ని పెంచి పోషించి.. చీడపురుగులా, వికృత శక్తిలా తయారుచేశారు. ఇందులో సమాజం పాత్ర ఉన్నా రాజకీయం కీలక పాత్ర పోషించింది. కుల వివక్షను నిర్మూలించాల్సిన రాజకీయం ఓటు బ్యాంకుల కోసం కుల క్షుద్ర రాజకీయాలను పెంచి పోషించింది. గల్లీ నుంచి ఢిల్లీ దాకా కుల వైరస్ పాకింది. ఓట్ల కోసమే పార్టీలు, కుల, మత, ప్రాంత విభేదాలను సృష్టిస్తున్నాయి. ఎన్ని చట్టాలొచ్చినా వీటిని సమూలంగా రూపుమాపలేం. మనిషి ఆలోచనా తీరుని మార్చే పరిస్థితుల్ని కల్పించటం అవసరం. కుల వివక్ష, విద్వేషాలు, ఒకరికి లాభం అంటే ఇంకొకరికి నష్టం అనే జీరోసమ్ రాజకీయాలు ఎందుకు పెచ్చరిల్లుతున్నాయో, అవి సమాజాన్ని కబళించకముందే ఏం చేయాలో సమాజంలో కాస్త మంచి మనసున్న వారంతా ఇప్పటికైనా ఆలోచించాలి. అందరికీ సమాన ఓటు హక్కుని ఇచ్చిన దేశంలో అందరికీ వ్యక్తిత్వం, నిజమైన స్వేచ్ఛ ఇచ్చని విద్యావ్యవస్థను ఎలా ప్రక్షాళన చేయాలో మథనం చేయాలి. కులాలకు అతీతంగా జీవించాలన్న స్పృహ ప్రతి ఒక్కరిలో రావాలి. సమాజంలో మార్పు తెచ్చే శక్తి, ఆసక్తి ఉన్న రోహిత్‌లాంటి వాళ్లని కాపాడుకోవాలి. ప్రతిభాపాటవాలు, వ్యక్తిత్వాన్ని బట్టి మాత్రమే మనుషుల్ని అంచనా వేయాలి. నిజమైన సమానత్వం, సమాజంలో తలెత్తుకుని తిరిగే పరిస్థితుల్ని కల్పించాల్సిన బాధ్యత యువత మీద ఉంది. తమ ఆవేశాన్ని ఆలోచనలను యువత కులరహిత సమాజాన్ని నిర్మించే దిశగా తీసుకెళ్లాలి. అందరికీ సమాన విద్య అందినప్పుడే ఇది సాధ్యం. హెచ్‌సియూ విద్యార్థుల డిమాండ్లు నెరవేరతాయని ఆశిస్తున్నా" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఫిబ్రవరి 1-15, 2016

సంపుటి - 7 సంచిక - 3

## లోపలి పేజీల్లో...


వివక్షపై అంబేద్కర్ హెచ్చరిక........................ 5
కులరాజకీయాల నేతలు సామాజిక ............ 6
రోహిత్ మృతిపై న్యాయ కమీషన్................. 8
అవిద్యే సాంఘిక న్యాయానికి ప్రథమ.............9
మాదకద్రవ్యాల పంజా(బ్)......................... 12
భవిష్యత్తును వణికిస్తున్న కాంబినేషన్ .......... 15
ఓ ఎంపీ అభ్యర్థి రూ.100 కోట్లు.................18
ఉపాధ్యాయ పోస్టులకు తప్ప చదువు.......... 19
దోషులపై చర్యలూ లేవు............................ 22
ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవ పరిస్థితులకి.............. 23
పిల్లల పెంపకం ఆధునిక మహిళకు కావాలి ..... 24
వివేకానంద లక్ష్యాల్ని అందుకునే .................. 27
ఆనాడే లోకసత్తాకు 15% ఓట్లు, 10 % సీట్లు... 29
సమాచార స్వేచ్ఛ ఏమయ్యేట్టు..................... 32




## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ *నం: 62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

## వివక్షపై అంబేద్కర్ హెచ్చరికను వర్సిటీలే పెడచెవిన పెట్టటం జాతి దౌర్భాగ్యం

# హెచ్‌సీయూ ఘటనపై న్యాయకమిటీ విచారణ జరపాలి: జేపీ

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) లో పరిశోధక విద్యార్థి వేముల రోహిత్ చక్రవర్తి మృతిపై ప్రభుత్వాధికారులతో కాకుండా స్వతంత్ర న్యాయకమిటీతో సమగ్ర విచారణ జరిపించి నివేదికను ప్రచురించాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు.

ఒక మనిషికి ఒకే ఓటు, ప్రతి ఓటుకూ ఒకే విలువ అని మనం 66 ఏళ్ల క్రితం నిర్మించుకున్న వ్యవస్థలో ప్రతి మనిషికీ ఒకే విలువ లేకుండా వివక్షల్ని కొనసాగిస్తే రాజకీయ ప్రజాస్వామ్యం బద్దలైపోతుందని బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ అసెంబ్లీలో చేసిన హెచ్చరికను సమాజానికి మార్గం చూపాల్సిన విశ్వవిద్యాలయాలే పెడచెవిన పెట్టటం జాతి దౌర్భాగ్యమని జేపీ అన్నారు. అందులోనూ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో కుల వివక్ష కారణంగా 26 ఏళ్ల పరిశోధక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడటం భారతీయులందరూ సిగ్గుతో తలదించుకోవాల్సిన ఘటనన్నారు.

శాస్త్రీయ అధ్యయనాలకు కేంద్రబిందువుగా ఉండే కేంద్రీయ విశ్వవిద్యాలయాలు సమాజానికి కాంతిరేఖలుగా ఉండాలని, కులాలకు అతీతంగా విద్యార్థులలో శాస్త్రీయభావాలను పెంపొందించాలని, సహచరుల చర్చలతో, ఆచార్యుల మార్గదర్శకంతో జిజ్ఞాసను పెంచటంలో ఇతర సంస్థల కంటే ముందుండాలని జేపీ అన్నారు. ఉన్నత విద్యావంతులైన సైన్స్ ప్రొఫెసర్లున్న హెచ్‌సీయూలో హేతుబద్ధ ఆలోచనాపరులు పెరగాల్సిందిపోయి, అసహనం, కులతత్వం, రాతియుగపు భావోద్రేకాలు పెచ్చరిల్లటం విషాదకరమన్నారు.

కుల, లింగ అణచివేతలు తరతరాలుగా వస్తున్న సమాజంలో శాస్త్రీయ చర్చలు, పరిశోధన వాతావరణాన్ని కల్పించటానికి హెచ్‌సీయూ సమూల ప్రక్షాళన చేసుకోవాలని, కులతత్వాన్ని నిర్మూలించేందుకు రాజీలేని చర్యలు తీసుకుని సృజనాత్మకతను పెంచే స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాలని జేపీ అన్నారు.

దీంతోపాటుగా అన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలూ విధిగా కుల, లింగ వివక్షల పట్ల ఉద్యోగులలో చైతన్యాన్ని పెంచేందుకు ఏడాదిలో కనీసం నాలుగు పర్యాయాలు శిక్షణ నిర్వహించాలని జేపీ డిమాండ్ చేశారు. రాజకీయ, చట్ట సమానతకు రాజ్యాంగపరమైన, చట్టపరమైన రక్షణలు కనీస స్థాయిలో సరిపోతున్నా, సామాజిక సమానత్వానికి మాత్రం అవి సరిపోవటం లేదన్నారు. అభివృద్ధిలో భాగంగా సామాజిక సమానత్వ స్పృహని పెంచేందుకు శిక్షణ తప్పనిసరి అని ప్రపంచవ్యాప్త అనుభవాలు సూచిస్తున్నాయన్నారు. భూస్వామ్య ఆధిపత్య సంస్కృతి నుంచి బైటపడకపోతే మనం ఒక దేశంగా పురోగమించటం కష్టమన్నారు. అందుకే భారత ప్రభుత్వం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ భయంకర కుల వివక్షకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలలో చైతన్యాన్ని పెంచేందుకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రోహిత్ వేములలాగా మరెవ్వరూ బలికాకూడదని, ఆ కుటుంబం బాధని లోక్‌సత్తా పంచుకుంటోందని జేపీ అన్నారు.

## ఢంకా బజాయించి కులం పేర్లను తొలగించుకోండి, కులాంతర వివాహాలు చేసుకోండి

"కులం పేర్లని, కులం పేరును సూచించే తోకలని సగర్వంగా, బహిరంగంగా, ఢంకా బజాయించి తొలగించుకోవాలని ఈదేశ యువతకు విజ్ఞప్తి చేస్తున్నాను. కులం కారణంగా కుదిర్చే పెళ్ళిళ్లని నిర్మొహమాటంగా తిరస్కరించండి. కుల సంకెళ్లను తెంచుకోండి, మీలా మీరు ఉండండి, మీ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని రూపొందించుకోండి. వ్యక్తిత్వం నచ్చితే కులం, మతం జానేదో అంటూ స్వేచ్ఛగా వివాహం చేసుకోండి. భవిష్యత్తు భారతదేశానికి మీరు చేయగలిగే గొప్ప సేవ ఇది" అని జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ★

# కుల రాజకీయాల నేతలు, సామాజిక ఆమోదమే పరిష్కారాలకు అవరోధాలు

విశ్వవిద్యాలయాలు కుల రాజకీయాలతో కలుషిత మయ్యాయని తెలిసినా రాజకీయాలు, సమాజం సరైన రీతిలో స్పందించకపోవటం వల్లే వేముల రోహిత్ రూపంలో మరో విద్యార్థి బలయ్యాడు. శాస్త్రీయ దృక్పథంతో విశ్వమంత దార్శనికతకు వేదికగా వ్యవహరించాల్సిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వంటి వాటిల్లో కూడా అధికార యంత్రాంగానికి వ్యక్తిగత పదవీ ప్రయోజనాలు, పార్టీలకు రాజకీయ ప్రయోజనాలు ముఖ్యం కావటం వల్ల సంకుచిత కుల భావాలు కరాళ నృత్యం చేస్తున్నాయి. ఆందోళనల్ని పెంచటానికి, తుంచటానికి కులాల్ని రెచ్చగొట్టటం పడికట్టు ఫార్ములా అయిపోయింది. విశ్వవిద్యాలయ పదవుల పైరవీలు చేసే నాయకులే రోహిత్ విషాదం వంటి ఘటనలు జరిగినప్పుడు ప్రత్యర్థి పార్టీల మీద విషం చిమ్మి మళ్లీ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుంటారు.

ముజఫర్ నగర్ అల్లర్లు అనే డాక్యుమెంటరీ ప్రదర్శనను గతేడాది ఢిల్లీలో ఏబీవీపీ అడ్డుకోవటాన్ని నిరసిస్తూ అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఎస్ఎ) సభ్యులైన రోహిత్ తదితరులు ఆందోళనకు దిగటం, దీనిపై ఏబీవీపీ నాయకుడు సుశీల్ ఫేస్‌బుక్‌లో కామెంట్ చేయటంతో మొదలైన వివాదం పోలీసు కేసుకి, వర్సిటీ నుంచి రోహిత్ సహా మరో నలుగురు పీహెచ్‌డీ విద్యార్థుల సస్పెన్షన్‌కి, చివరికి ఈ ఏడాది జనవరి 17న క్యాంపస్‌లో రోహిత్ ఆత్మహత్యకి దారితీసింది.

కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో ఓట్లు అడగకుండా, ఈ దేశంలో కులనిర్మూలనకోసం అందరికీ నాణ్యమైన విద్యను అందించాలని పోరాడిన లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్‌ని మినహాయిస్తే.. రోహిత్ ఆత్మహత్యను నిరసిస్తూ జరుగుతున్న ఆందోళనలకు మద్దతిస్తూ హెచ్‌సీయూను సందర్శించిన నేతల్లో దాదాపు ఎవ్వరూ కుల రాజకీయాలను నిర్మూలించి అందరికీ నాణ్యమైన విద్యను అందించటానికి కృషి చేసిన వారు కారు. ఇక్కడ 'దాదాపు' అనే పదాన్ని కూడా బెనిఫిట్ ఆఫ్ డౌట్ అవతలివారికి ఇవ్వాలనే ఉదార రాజకీయ సంస్కృతిలో భాగంగా వాడిందే. మిగతా దేశాల్లో సోషలిస్టులు మంచి విద్య, వైద్యం కోసం పోరాడితే, మనదేశంలో సోషలిస్టు భావాలున్నవారు మాత్రం ఆ మౌలికాంశాలను పట్టించుకోకుండా పరోక్షంగా కుల రాజకీయాలను పెంచి పోషించారు. ఇప్పుడు కూడా చాలామంది నేతల నోటి వెంట కుల రాజకీయాల్ని ఎలా నిర్మూలిద్దాం, విద్యారంగాన్ని ఎలా బాగుచేద్దాం, సంఘర్షణ స్థానంలో అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే కొత్త రాజకీయ సంస్కృతిని ఎలా పెంపొదిద్దాం అనే పరిష్కారాలు రావటం లేదు.




హెచ్‌సీయూ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న పొదిలి అప్పారావు టీడీపీకి చెందిన ఓ మాజీ ఎంపీకి బంధువని, కేంద్ర మంత్రి ఎం. వెంకయ్య నాయుడు అండతోనే లాబీయింగ్‌లతో ఆ పదవిని చేజిక్కించుకున్నారనే వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. క్యాంపస్ గొడవని క్యాంపస్‌లోనే పరిష్కరించుకుందామన్న రోహిత్ మాటలను లెక్కచేయకుండా

ప్రత్యర్థిగా ఉన్న విద్యార్థి సంఘం జాతీయ స్థాయి అంశంగా మార్చటానికి ప్రయత్నించిందనే మాటా వినిపిస్తోంది. స్వతంత్ర న్యాయ విచారణతోనే వీటిల్లోని నిజాలు, కేంద్ర మంత్రుల ఉత్తరాల వెనక వ్యవహారాలు బైటకొస్తాయి. అలాంటి విచారణను ప్రచురిస్తే, రాబోయే కాలంలోనైనా ఉన్నత విద్యాసంస్థల్లో కుల రాజకీయాలకు కళ్లెం వేయటానికి కొన్ని విధానాలను రూపొందించేందుకు ప్రజాస్వామిక ప్రాతిపదికలు దొరుకుతాయి.

హెచ్‌సీయూలో ఆత్మహత్య ఘటనలు గతంలోనూ జరిగాయి. కమిటీ విచారణలు జరిగాయి, కొన్ని సూచనలూ వచ్చాయి. అయితే పదవీ రాజకీయాల వల్ల అవి అమలుకు నోచుకోకుండా కుల రాజకీయాలు యథాతథంగా కొనసాగుతున్నాయి.

2013లో ఇంటిగ్రేటెడ్ ఎంఏ (లింగ్విస్టిక్) చదువుతున్న 21 ఏళ్ల వి. రాజు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. దీనిపై కొంతమంది అధ్యాపకులు కమిటీగా ఏర్పడి అదే ఏడాది హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. విద్యార్థుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా వర్సిటీ అధికారులు, అధ్యాపకులు విద్యార్థులను ఒత్తిడికి గురిచేయటమే విద్యార్థుల ఆత్మహత్యకు కారణమని అందులో పేర్కొన్నారు. రాజు ఆత్మహత్యపై నిజ నిర్ధారణ కమిటీ కూడా దర్యాప్తు చేసింది. తొలుత రాజు మృతికి ప్రేమ వైఫల్యమే కారణమని వర్సిటీ అధికారులు తేల్చి చెప్పారు. కమిటీ మాత్రం అధికారుల మాటల్లో వాస్తవం లేదని తేల్చింది. ఈ వర్సిటీతో పాటు నగరంలోని ఇతర కళాశాలల్లో జరిగిన ఆత్మహత్యలపై ఒక సమగ్ర నివేదికను సమర్పించింది. వీరంతా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారవడం వల్ల పట్టణ సంస్కృతికి అలవాటు పడలేక సతమతమవడం, ఆంగ్లం, కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడమూ ఒక కారణమని గుర్తించింది. దీనికితోడు ఆర్థిక సమస్యలను ఎత్తిచూపింది. ఉపకార వేతనాలు, జాతీయ ఉపకార వేతనాల మీదే ప్రధానంగా ఆధారపడి బతకడం, కొన్నిసార్లు వీటిని కోల్పోవడం, కులాల మధ్య తేడాలు తదితర అంశాలన్నీ విద్యార్థుల ఆత్మహత్యకు హేతువులని కమిటీ నివేదికలో తేల్చిచెప్పింది.

ఈ నివేదికలోని అంశాలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు 2013 జులై 1న విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు మార్గదర్శకాల గురించి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పలు సూచనలు చేసింది. ఇంతవరకూ ఒక్కటీ అమలు కాలేదు. అమలుకు ప్రయత్నం కూడా లేకపోవటం వల్లే ఆత్మహత్యలు పునరావృత మవుతున్నాయని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

**కోర్టు మధ్యంతర ఉత్తర్వులో ఇచ్చిన మార్గదర్శకాలు :**

- విద్యార్థులు తమ సమస్యలను చెప్పుకునేందుకు వారితోనే ఓ కమిటీ వేయాలి. వాటిని ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరించేందుకు ఒక అకడమిక్ కమిటీ ఉండాలి
- ప్రతి విభాగానికీ ఒక అకడమిక్ కమిటీని ఏర్పాటు చేయాలి. కమిటీల మధ్య సమన్వయం కోసం అంబుడ్స్‌మన్ ఉండాలి
- రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, వికలాంగులకు ప్రత్యేక ప్రిపరేషన్ కోర్సులు, బ్రిడ్జి కోర్సులు ప్రవేశపెట్టాలి
- విద్యార్థుల్లో ఆత్మస్థయిర్యాన్ని నింపేందుకు నిపుణులను నియమించాలి
- నల్సార్ విశ్వవిద్యాలయం అనుసరిస్తున్న విధంగా బాధితులు, నేరస్తుల అవసరాలను, వారి నేపథ్యాలని పరిగణలోకి తీసుకుని పరిష్కారం చెప్పాలి. అందుకు ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. అవసరమైతే నల్సార్ వర్సిటీ అధికారుల సాయం తీసుకోవాలి. ★

# రోహిత్ మృతిపై న్యాయ కమిషన్

హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై అధ్యయనానికి న్యాయ కమిషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కమిషన్ మూడు నెలల్లోగా నివేదిక అందచేస్తుందని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (హెచ్ఆర్‌డీ) ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, వర్సిటీ ప్రాంగణాల్లో ఎలాంటి వివక్షకు తావు లేకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఇందుకు వర్సిటీల వైస్ ఛాన్సలర్లు, విశ్వవిద్యాలయాల్లోని సీనియర్ అధికారులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి మార్గనిర్దేశనం చేయనుంది. “ఇటీవల సెంట్రల్ వర్సిటీలో జరిగిన పరిణామాల క్రమం, అందుకు దారి తీసిన పరిస్థితులను న్యాయ కమిషన్ అధ్యయనం చేస్తుంది. ఇక ముందు ఇలాంటి దురదృష్టకర ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక అందచేస్తుంది” అని హెచ్ఆర్‌డీ శాఖ తన ప్రకటనలో వివరించింది. ఉన్నత విద్యాసంస్థల్లో సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన విద్యార్థుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కూడా మానవ వనరుల శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు, వాటిని వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అణగారిన విద్యార్థుల సమస్యల పరిష్కారం, వర్సిటీ ప్రాంగణాల్లో వివక్షకు తావులేకుండా ఏం చర్యలు తీసుకోవాలన్న అంశాలపై త్వరలోనే దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లకు, వాటిలో పనిచేసే సీనియర్ అధికారులకు ప్రత్యేకంగా ఒక ఛార్టర్‌ని విడుదల చేయాలని నిర్ణయించినట్టు ప్రకటనలో తెలిపింది. గాంధీనగర్ ఐఐటీలో అనుసరిస్తున్న పీర్ గ్రూప్ అసిస్టెడ్ లెర్నింగ్ (పీఏఎల్) విధానాన్ని దేశంలోని అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో అమలు చేస్తామని తెలిపింది. ఈ విధానంలో సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు విద్యాపరంగా సాయం అందించటంతోపాటు వారు సవాళ్లను ఎదుర్కొని నిలబడేందుకు వీలుగా ప్రత్యేకంగా మెంటార్లను ఏర్పాటు చేస్తారు. ★


# ఒక బస్సు జనం వద్దే సగం ప్రపంచ సంపద

ప్రపంచంలో అత్యంత సంపన్నులైన 62 మంది ఉన్న సంపద.. అత్యంత నిరుపేదలైన సగం ప్రపంచ జనాభా (దాదాపు 370 కోట్లమంది) వద్దనున్న సంపదకు సమానమని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వెల్లడించింది. 62 మంది అపర కుబేరుల వద్దనున్న ఆస్తి 2010 నుంచి ఇప్పటి వరకూ సగం కన్నా ఎక్కువ పెరిగి రూ. 1,19,15,983 కోట్లకు చేరుకుంది. అదేసమయంలో ప్రపంచ జనాభాలో సగం మంది నిరుపేదల ఆస్తి 41శాతం పడిపోయి రూ. 67,70,445 కోట్లు తగ్గిపోయింది. ఆక్స్‌ఫాం అనే హక్కుల సంఘం ఈ అధ్యయనాన్ని నిర్వహించింది. దీనిపై ‘ఒక్కశాతం వ్యక్తుల ఆర్థిక వ్యవస్థ’ పేరుతో డబ్ల్యూఈఎఫ్ నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం.. అతికొద్దిమంది వ్యక్తుల వద్ద సంపద పోగయ్యే ప్రక్రియ ఎప్పటికప్పుడు వేగవంతమవుతోంది. ప్రపంచ జనాభాలో సగం మంది వద్దనున్న సంపదకు సమానమైన సంపద 2010లో 388 మంది వద్ద ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 62కు పడిపోయింది. సంపద కేంద్రీకరణతో పెరుగుతున్న ఆర్థిక అంతరాలను నిలువరించాలని, లేకుంటే పేదరికానికి వ్యతిరేకంగా గత శతాబ్ది ఆఖరి దశకంలో సాధించిన ప్రగతికి అర్థం లేకుండా పోతుందని ఈ నివేదిక వాపోయింది. ఒక బస్సులో వెళ్లేంతమంది సంపన్నులు ఈ ప్రపంచంలోని సగం జనాభాకు సమానమైన సంపదను కలిగివుండటం ఎంతమాత్రం ఆమోదయోగ్యంకాదని డబ్ల్యూఈఎఫ్ అంతర్జాతీయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విన్నీబ్యాన్‌యిమా అన్నారు. పన్నులను ఎగవేయటం కోసం సంపన్నులు విదేశాలకు తరలిస్తున్న సంపద దాదాపు రూ. 5,14,55,382 కోట్లని, ఈ తరలింపుని అడ్డుకుని పన్నులు విధించగలిగితే ప్రభుత్వాలకు ఏటా రూ. 12,86,384 కోట్ల అదనపు ఆదాయం లభిస్తుందని నివేదిక తెలిపింది. స్విట్జర్లాండ్ దావోస్‌లో ఇటీవల జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పోప్ ఫ్రాన్సిస్ కూడా సంపద కేంద్రీకరణ పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దారిద్ర్య సృష్టిలో మీ పాత్ర ఎంత? అని అపర కుబేరులుగా ఉన్నవారిని ప్రశ్నించారు. ★

# అవిద్యే సాంఘిక న్యాయానికి ప్రథమ శత్రువు

- డా॥ జయప్రకాష్ నారాయణ్

**ఇటీవలే మళ్లీ విద్యామంత్రిగా నియమితులయిన మురళీమనోహర్ జోషి మరోసారి ఓ భీషణ ప్రతిజ్ఞ చేశారు. 1950 నుంచి మనం వింటున్నట్లుగానే పది సంవత్సరాలలో అందరికీ అక్షరజ్ఞానం కలిగిస్తామని ప్రకటించేశారు. ఒకసారి పత్రికలో పతాక శీర్షికలు వచ్చేస్తే నేతల దృష్టిలో ఒక ఆ సమస్య పరిష్కారమయినట్లే! అందరికీ అక్షరజ్ఞానం కావాలంటే ఎనభైవేల కోట్ల రూపాయల పెట్టుబడి కావాలని, అందుకు ఆలోచిస్తున్నామని మంత్రి చెప్పారు! ఒకవేళ ప్రభుత్వం నిధులు కేటాయించినా అవి భవనాలకు, కాంట్రాక్టులకు, టెండర్లకు సరిపోతాయి. మైరన్ వీనర్ లాంటి సామాజిక శాస్త్రజ్ఞులు సమాజంలో అక్షరజ్ఞానానికి, అధికార వికేంద్రీకరణకు, లబ్ధిదారులకు అధికారాలకు, బాలకార్మిక వ్యవస్థకు మధ్య ఉన్న సంబంధాన్ని సాక్ష్యాధారాలతో సహా వెలికితీసి ఎన్నడో మన ముందు పెట్టారు.**





ఎన్నికలయిపోయి ప్రభుత్వాలు ఏర్పడటంతో రాజకీయవాదులు కాస్తంత అలసట తీర్చుకుంటున్నారు. ఎప్పుడూ మతం గురించి, ఆధ్యాత్మికత గురించి మాట్లాడే ఈ సమాజంలో అధికారం అంటే ఉండే మక్కువ ప్రపంచంలో మరే దేశంలోనూ కానరాదు. చర్చలు, వాదోపవాదాలు, ఆందోళనలు, ఉపన్యాసాలు, భీషణ ప్రతిజ్ఞలు- అన్నీ చాలామటుకు అధికారాన్ని కైవశం చేసుకోడానికి, దాన్ని నిలుపుకోడానికి ఉద్దేశించినవే. అసలు వ్యక్తిగత అధికారం మాత్రమే లక్ష్యంగా మారిపోయి, ప్రజలు కేవలం ఈ యజ్ఞంలో సమిధలుగా, నిమిత్తమాత్రులుగా అధిక శాతం నేతల కళ్లకు కనిపిస్తున్నారు. అధికారం కేవలం మంచి పాలనకు, ప్రజాసంక్షేమానికి, సమాజంలోని పిల్లలందరి మంచి భవిష్యత్తుకి ఒక సోపానం మాత్రమేనని భావించే కొద్దిమంది అమాయకులు ఈ అధికార క్రీడలో త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్నారు.

### వెక్కిరిస్తున్న రాజ్యాంగ హక్కులు

ఈ గందరగోళం మొత్తంలో జాతిని పట్టిపీడిస్తున్న మౌలిక రుగ్మతలను గూర్చిన అవగాహనగానీ, వాటిని ఎదుర్కోవాలన్న తపనగానీ మచ్చుకైనా కానరావు. దేశంలో నిరక్షరాస్యత, లక్షలమంది పిల్లలు బాల్యంలోనే గొడ్డుచాకిరీ చేయాల్సిరావటం, కులం పేరుతో వివక్ష ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ మూడు అంశాలకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. దేశంలో దళితులు, బీదలు ఎన్నికల్లో ఓట్లు వేసే మరబొమ్మలుగా మాత్రమే పార్టీలకు కనిపిస్తున్నారు. రాజ్యాంగంలో 15వ అధికరణం ద్వారా కుల వివక్ష లేకుండా అందరికీ సమానావకాశాలు కల్పించాలని రాజ్యాంగ నిర్మాతలు సంకల్పించారు. 17వ అధికరణం ద్వారా అస్పృశ్యతను నిషేధించారు. 24వ అధికరణం ద్వారా 14 ఏళ్ల లోపు బాలలను ఫ్యాక్టరీల్లో, గనుల్లో, శారీరక బాధ కలిగే ఇతర వృత్తుల్లో పనికి పెట్టటాన్ని నిషేధించారు. ఇవికాక ఆదేశిక సూత్రాల ద్వారా 45వ అధికరణంలో పధ్నాలుగేళ్లలోపు బాలలందరికీ నిర్బంధ ఉచిత విద్యను కల్పించాలని తీర్మానించారు. 46వ అధికరణం ద్వారా

దళిత వర్గాలు దోపిడీకి గురికాకుండా నిరోధించాలని పాలకులను ఆదేశించారు. 47వ అధికరణం ద్వారా ప్రజలందరికీ కనీస ఆరోగ్య వసతులు, పౌష్టికాహారం, కనీస జీవన ప్రమాణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఇవన్నీ ఉదాత్తమైన ఆశయాలు, నాగరికతకు చిహ్నాలు, ఆధునిక ప్రపంచంలో ప్రజల సుఖసంతోషాలకు కనీస అవసరాలు, మనిషి హుందాతనానికి ప్రతీకలు. కానీ వాస్తవానికి వీటిల్లో ఏ రంగంలోనూ చిత్తశుద్ధితో చర్యలు తీసుకోలేదు. ఏదో ఒక విధంగా దళిత వర్గాల్లో, బీదల్లో ఆశలు రేకెత్తించి వారి ఓట్లు పొందటం, ఆవేశాలను రెచ్చగొట్టి భ్రమలు కల్పించి వారిని మచ్చిక చేసుకోవటం తప్ప, అణగారిన వర్గాల వారిని ఆధునిక ప్రజాస్వామ్యంలో సమాన హక్కులున్న పౌరులుగా సమాజం, రాజ్యవ్యవస్థ చూడలేకపోతున్నాయి. బీదలకు, దళితులకు సమాన హక్కులు ఇచ్చామని చెప్పుకుంటే అది ఆత్మవంచనే. అస్పృశ్యత ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ నేటికీ ఎన్నో రంగాలలో కనిపిస్తోంది. ఇప్పటికీ ఎందరో అభాగ్యులు దుర్భరమైన బానిస బతుకులు వెళ్లదీస్తున్నారు. దేశంలో కనీసం రెండు కోట్ల మంది (కొన్ని అంచనాల ప్రకారం నాలుగు కోట్ల వరకు) చిదిమిన పాల్గారు బుగ్గల పసిపాపలు తమ చిన్నారి చేతులతో కాయకష్టం చేసి పొట్ట నింపు కుంటున్నారు. వీరిలో నూటికి 90మంది దళితులు, అణగారిన వర్గాలకు చెందినవారే. నేటికీ సమాజంలో నూటికి 45మందికి అక్షర జ్ఞానం లేదు. నిజానికి అక్షరాస్యత అంటే చదవటం, రాయటం, భాష అర్థం చేసుకోవటం, కనీసం కొంతమేరకు కూడికలు, గణితం నేర్పటం అని నిర్వచిస్తే, అది సమాజంలో కేవలం 20-25 శాతానికి మాత్రమే పరిమితమయింది. నిరక్షరాస్యులలో అధిక శాతం మళ్లీ దళితులే! అగ్రవర్ణాలుగా భావిస్తున్నవారిలో అక్షరజ్ఞానం లేనివాళ్లు దాదాపు ఉండరు. దళితులకు రిజర్వేషన్లిచ్చి వాళ్లను ఉద్ధరిస్తున్నట్లు నటనే తప్ప దళిత బాలలకు కనీస విద్యా సదుపాయాలుగానీ, అవకాశాలుగానీ లేవు. ప్రకృతి ఇచ్చిన శక్తి సామర్థ్యాలను, మేధాశక్తిని వికసింపచేసే విద్యావకాశాలు లేకపోవడంతో దళితవర్గాలలో అత్యధికులు నిరంతరం దోపిడీకి గురవుతున్నారు. బీదవర్గాలకు కనీస ఆరోగ్య సదుపాయం ఏమేరకు అందుబాటులో ఉందో మనందరికీ తెలుసు. అంతో



ఇంతో వనరులున్న కుటుంబాలుగానీ, ఉద్యోగాలున్నవాళ్లుగానీ జబ్బు చేస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లే సాహసం చేస్తున్నారేమోనని పరిశీలిస్తే ప్రజలకు కల్పించే ఆరోగ్య సదుపాయాలు ఎలా ఉన్నాయో విశదమవుతుంది. ప్రభుత్వ స్కూళ్లలో పనిచేసే అధ్యాపకులలో నూటికి 99 మంది తమ పిల్లలను తాము పాఠాలు చెప్పే స్కూళ్లకు పంపే సాహసం చేయలేకపోతున్నారు.

### అంబేద్కర్ తపన

భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగసభ ఆమోదించింది. నవంబర్ 25న ముసాయిదా రాజ్యాంగంపై జరిగిన చర్చకు సమాధానం చెబుతూ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ దళిత వర్గాల దుస్థితిని, నూతన రాజ్యాంగ వ్యవస్థలో అందరికీ హుందాతనం కల్పించాల్సిన అవసరాన్ని చాలా స్పష్టంగా వివరించారు. "శతాబ్దాల పర్యంతం రాజ్యాధికారం, అన్ని అవకాశాలు కొన్ని కులాలకు మాత్రమే పరిమితం కావటంతో దళితులు బరువు మోసే జంతువులతో సమానంగా మిగిలిపోయారు, వేటకు గురయ్యే సాధుజంతువులుగా బలవుతున్నారు. ఈ గుత్తాధిపత్యం దళితులను అణచి ఉంచటమే కాక వారి జీవితాలకు అర్థం లేకుండా చేసింది. అణగారిన వర్గాల సహనం నశించిపోతోంది. ఆత్మసాక్షాత్కారం కోసం దళితులు పడే తపన వర్గపోరాటంగా, హింసగా మారకుండా జాగ్రత్త పడాలి... మన స్వతంత్రం, ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉండాలంటే దళిత

జాతుల విముక్తి కోసం, సమానత్వం కోసం కృషి చేయాలి... స్వతంత్రం వచ్చాక ప్రతిదానికీ బ్రిటీషు వాళ్లని దోషులుగా నిందించే అవకాశం మనకు లేదు. ఇకముందు జరిగే తప్పిదాలకు పూర్తి బాధ్యత మనది మాత్రమే... ప్రజలకు సిద్ధాంతాలంటే ఆసక్తి నశిస్తోంది... ప్రజల కోసం ప్రభుత్వాలను నడపలేకపోతే ప్రజల పేరుతో నడిచే ప్రభుత్వాలు పౌరులకు అక్కర్లేదు..." అంబేద్కర్ చెప్పిన ఈ మాటలు అక్షరసత్యాలు. రాజ్యాంగం రాసుకుని 50 సంవత్సరాలు పూర్తవుతోంది. ఇప్పటికీ కులవివక్ష, నిరక్షరాస్యత, కనీస సదుపాయాల లేమి పేదల జీవితాలను దుర్భరం చేస్తూ, హుందాతనాన్ని అణచివేస్తున్నాయి. అగ్రకులాల ధ్యాసంతా ఎంతసేపటికీ ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలలో దళితులకు కల్పించిన రిజర్వేషన్ల మీదే! దానివల్ల తమకు, తమ బిడ్డలకు ఏదో అన్యాయం జరిగిపోతుందన్న దుగ్ధ తప్ప, అసలు సమాజంలో జరుగుతున్న అన్యాయం పట్ల అవగాహన లేదు. ఇదిలా కొనసాగితే రేపు సమాజంలో శాంతి, సయోధ్య అసాధ్యమన్న స్పృహ లేదు. నూటికి 90మంది దళిత బాలలకు, అక్షరజ్ఞానం లేనప్పుడు ఎన్ని రిజర్వేషన్లు కల్పిస్తే ఏం ప్రయోజనం? తాత్కాలికంగా మభ్యపెట్టటం కోసం ఎన్ని సబ్సిడీలు ప్రకటిస్తే మాత్రం ఏం లాభం. దళితులకు అక్షరజ్ఞానం వస్తే తమ దగ్గర చాకిరీ చేయటానికి జీతగాళ్లు దొరకరని రైతుల భయం! 'తెలివి' మితిమీరితే మాట వినరని "అగ్ర" వర్ణాల భయం! పట్టణాలలో సంపన్నవర్గాలలో, మధ్యతరగతి వర్గాలలో ధ్యాసంతా ఎంతసేపటికీ ఇంట్లో పనిమనుషులు, వంట మనుషులు తక్కువ జీతానికి, నమ్మకంగా పనిచేసే వాళ్లు దొరుకుతారా లేదా అని మాత్రమే! అందుకు చిన్న పిల్లలయితే మరీ మంచిది. బుద్ధిగా మాట విని,పెట్టింది తిని పనిచేస్తారు! మన పిల్లలు మంచి బట్టలు వేసుకుని కాన్వెంటు స్కూలుకు వెళుతుంటే, పనిపిల్లలు వాళ్లకు టిఫిను సిద్ధం చేసి పుస్తకాలు సర్దాలి! ఇలా ప్రజాస్వామ్యం ఎంతకాలం బతుకుతుంది?

## పసలేని ప్రతిజ్ఞలు

ఇటీవలే మళ్లీ విద్యామంత్రిగా నియమితులయిన మురళీమనోహర్ జోషి మరోసారి ఓ భీషణ ప్రతిజ్ఞ చేశారు. 1950 నుంచి మనం వింటున్నట్లుగానే పది సంవత్సరాలలో అందరికీ అక్షరజ్ఞానం కలిగిస్తామని ప్రకటించేశారు. ఒకసారి పత్రికలో పతాక శీర్షికలు వచ్చేస్తే నేతల దృష్టిలో ఒక ఆ సమస్య పరిష్కారమయినట్లే! అందరికీ అక్షరజ్ఞానం కావాలంటే ఎనభైవేల కోట్ల రూపాయల పెట్టుబడి కావాలని, అందుకు ఆలోచిస్తున్నామని మంత్రి చెప్పారు! ఒకవేళ ప్రభుత్వం నిధులు కేటాయించినా అవి భవనాలకు, కాంట్రాక్టులకు, టెండర్లకు సరిపోతాయి. మైరన్ వీనర్ లాంటి సామాజిక శాస్త్రజ్ఞులు సమాజంలో అక్షరజ్ఞానానికి, అధికార వికేంద్రీకరణకు, లబ్ధిదారులకు అధికారాలకు, బాలకార్మిక వ్యవస్థకు మధ్య ఉన్న సంబంధాన్ని సాక్ష్యాధారాలతో సహా వెలికితీసి ఎన్నడో మన ముందు పెట్టారు. ఇప్పుడు కమిటీలు, కబుర్లు అక్కర్లేదు. చేతలు కావాలి. అందరికీ అక్షరజ్ఞానం కావాలంటే పాతికవేల కోట్ల రూపాయలతో పాఠశాల గదులు కావాలి. అది కేవలం ఇరవై రోజులలో ప్రభుత్వాలు చేసే ఖర్చు మాత్రమే! ఆ ఖర్చు పెట్టకపోయినా, తాత్కాలికంగా ప్రత్యామ్నాయాలున్నాయి. అక్షరజ్ఞానానికి ముందు కావల్సింది సంకల్పబలం, చేసిన ఖర్చు సద్వినియోగమయ్యేలా విద్యలో తల్లిదండ్రుల పాత్ర, గుమాస్తాలు, బంట్రోతుల బదులు అవసరమైనంతమంది అధ్యాపకుల నియామకం, బాధ్యతతో వారు పనిచేసేలా చర్యలు. భవనాలు అవసరమయినా, వాటితో మాత్రమే విద్యాస్థాయి పెరగదు. అన్నింటినీ మించి సమాజంలో 'అగ్ర' వర్ణాలలో కులతత్వం, దాని ప్రభావం వల్ల సమాజాన్ని 'అగ్ర', 'అల్ప' వర్గాలుగా విభజించే మానసిక స్థితి అంతం కావాలి. అందుకు బలమైన సాంఘిక, రాజకీయ ఉద్యమం కావాలి. కేరళలో, మిజోరంలో, చివరికి తమిళనాడులో అక్షరజ్ఞానం పెంచగలిగినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో, బీహార్‌లో, ఒరిస్సాలో, ఉత్తరప్రదేశ్‌లో, రాజస్థాన్‌లో నిరక్షరాస్యత నిర్మూలించటానికి ఏం ప్రతిబంధకాలున్నాయి? చిత్తశుద్ధి లోపం తప్ప! విజయోత్సవాలు, సంబరాలు, అసంబద్ధపు ప్రకటనలు ఆపి అటు సమాజంలో అన్ని వర్గాలు, ఇటు మన సేవ కోసం ఎన్నికయిన ప్రభుత్వాలు ఒళ్లు వంచి చిత్తశుద్ధితో నాణ్యమైన అక్షరజ్ఞానం అందరికీ వెనువెంటనే అందించేందుకు చర్యలు చేపట్టాలి. మాటలలో ప్రతాపం చూపే నేతలు చేతలలో చేవ చూపాలి. అప్పుడే ఈ మౌలిక పోరాటంలో విజయం సాధించగలం. నిజమైన అక్షరాస్యత అందరికీ అబ్బినప్పుడే దళితులకు కులవివక్ష నుంచి, బాలలకు బానిసత్వం నుంచి, బీదలకు దారిద్ర్యం నుంచి విముక్తి సాధ్యమవుతాయి. అప్పుడే సాంఘిక న్యాయం సాధ్యమై, రాజ్యాంగం అపహాస్యం కాకుండా అర్థవంతమవుతుంది.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా అక్టోబర్ 25, 1999న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ★

# మాదక ద్రవ్యాల పంజా(బ్)

## ఉగ్రదాడులకు ఊతం .. యావత్ భారతానికీ పొంచి వున్న ముప్పు

- ఏఏవీ ప్రసాద్

పఠాన్ కోట్ వైమానిక స్థావరంపై పాక్ ఉగ్రవాదుల దాడి, టెర్రరిజానికీ మాదక ద్రవ్య వ్యాపారానికీ మధ్య ఉన్న ప్రమాదకరమైన పొత్తును బయటపెట్టింది. పాకిస్థాన్ నుంచి మాదక ద్రవ్య అక్రమ రవాణాకు స్మగ్లర్లు ఉపయోగించే మార్గం ద్వారానే టెర్రరిస్టులు పంజాబ్‌లోకి చొరబడ్డారని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. స్మగ్లర్లు మొదట మాదక ద్రవ్యాలతోపాటు ఆయుధాలనూ పఠాన్ కోట్ పరిసరాలకు చేర్చారని, వారి వెనక పంజాబ్‌లో ప్రవేశించిన టెర్రరిస్టులు ఆ ఆయుధాలతో వైమానిక స్థావరంపై దాడికి దిగారని తెలుస్తోంది. పఠాన్ కోట్ ఉదంతంలో టెర్రరిస్టులు కిడ్నాప్ చేసి తరవాత తీరిగ్గా విడచిపుచ్చారని చెబుతున్న పోలీసు సూపరింటెండెంట్ సల్వీందర్ సింగ్‌కు స్మగ్లర్లతో సంబంధాలు ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇటీవలి వరకు గురుదాస్ పూర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ హోదాలో ఉన్న సల్వీందర్ అయిదుగురు మహిళా కానిస్టేబుళ్లను లైంగికంగా వేధించారని ఆరోపణలు రావడంతో ఆయన్ను జలంధర్‌కి బదిలీ చేశారు. దాడి జరిగే సమయానికి సల్వీందర్ గురుదాస్ పూర్ నుంచి పొరుగు జిల్లా పఠాన్ కోట్‌కు ఎందుకు వెళ్లినట్టు?



అదీ స్మగ్లర్ల రూటుకు దగ్గర్లోని కొలియాన్ గ్రామం వద్ద ఎందుకు సంచరించినట్లు? అని అనుమానాలు రేకెత్తాయి. తన మిత్రుడు, ఆభరణాల వ్యాపారి రాజేష్ వర్మ, వంటవాడు మదన్ గోపాల్‌లతో కలిసి జనవరి 1 అర్థరాత్రి ప్రార్థనా మందిరానికి వెళ్లానని సల్వీందర్ చెబుతున్నారు. అక్కడ టెర్రరిస్టులు తారసపడి సల్వీందర్ అధికార వాహనాన్ని హైజాక్ చేశారట! సల్వీందర్ బృందంలోని ముగ్గుర్నీ ప్రాణాలతో విడిచిపెట్టారట! సొంత పని మీద వెళ్లేటప్పుడు అధికార వాహనాన్ని ఉపయోగించటమెందుకో! సల్వీందర్ కథనంతో సంతృప్తి చెందని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆయనకు మాదక ద్రవ్యాల మాఫియాతో సంబంధాలున్నాయా అనే కోణం నుంచి దర్యాప్తు జరుపుతోంది. (కాగా, పఠాన్ కోట్ ఘటనలో సల్వీందర్ సింగ్ పాత్ర ఉందనటానికి ఇంతవరకు ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎన్ఐఏ ఇటీవల ప్రకటించింది)

### అకాలీ మంత్రుల మిలాఖత్ ?

ఆయన సంగతి అటుంచితే, పాక్ స్మగ్లర్లతో పాటు అకాలీదళ్, కాంగ్రెస్ నాయకులతోనూ సంబంధాలున్న 80 మంది పోలీసు జాబితాను మాజీ అదనపు డీజీపీ (ఇంటెలిజెన్స్) శశికాంత్, 2014లోనే పంజాబ్, హర్యానా హైకోర్టుకు సమర్పించారు. మాదక ద్రవ్య స్మగ్లర్లతో పోలీసులే కాదు, సరిహద్దు భద్రతాదళ (బీఎస్ఎఫ్) సిబ్బంది కూడా కుమ్మక్కు అయ్యారని చాలాకాలం నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఫలితంగా కనీసం ముగ్గురు నలుగురు బీఎస్ఎఫ్ కమాండెంట్లు, అనేకమంది జవాన్లు, దిగువస్థాయి అధికారులు కటకటాల పాలయ్యారు. సరిహద్దులో పహారా లోపాలను పఠాన్ కోట్ దాడి మరొక్కసారి బయటపెట్టింది. స్మగ్లర్లు పాకిస్థాన్ నుంచి పంజాబ్‌కు రెండు మార్గాల గుండా మాదక ద్రవ్యాలను

తరలిస్తున్నారు. కరెంటు కంచె ఉన్న చోట పీవీసీ పైపుల్లో మాదక ద్రవ్య పొట్లాలు పెట్టి పంజాబ్ వైపు తోస్తున్నారు. కరెంటు కంచె కింద తవ్విన గోతుల ద్వారా కూడా మాదక ద్రవ్యాలను నెడుతున్నారు. అక్కడి నుంచి కిలోకు రూ. 60,000 చొప్పున చెల్లించి 'కొరియర్ల' ద్వారా లోతట్టు ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. నిఘా వ్యవస్థ కళ్లు గప్పడానికి భారతీయ స్మగ్లర్లు పాకిస్థానీ 'సిమ్' కార్డులనూ, పాక్ స్మగర్లు భారతీయ 'సిమ్' కార్డులనూ ఉపయోగిస్తున్నారు. సరిహద్దుల్లో పక్కా రోడ్లు లేకపోవడం స్మగ్లర్లకు కలిసివస్తోంది.

మాదక ద్రవ్య అక్రమ రవాణాకు స్మగ్లర్లు ఎంచుకున్న రెండో మార్గం– నదీ మార్గం. రావి, బియాస్ నదులు ప్రవహించే 100 కిలోమీటర్ల ప్రాంతం గుండా మత్తుమందులను పడవల్లో రవాణా చేస్తున్నారు. ఈ నదీ పరివాహక ప్రాంతం గురుదాస్ పూర్, పఠాన్ కోట్ జిల్లాల సమీపంలోనే ఉంది. గురుదాస్ పూర్ ప్రాంతం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు ఆయువుపట్టుగా మారింది. ఈ జిల్లాలో టెర్రరిస్టులు సరిహద్దు దాటడం ఇది రెండోసారి. ఆరు నెలల క్రితం పాక్ టెర్రరిస్టులు ఇదే జిల్లాలో చొరబడి ఒక బస్సుపై కాల్పులు జరిపి, దీనా నగర్ పోలీసు స్టేషన్‌పై దాడికి దిగారు. ఈ ఉదంతంపై ఎన్ఐఏ పరిశోధనకు రాష్ట్ర పోలీసులు మోకాలడ్డారనీ, మాఫియాతో పోలీసుల మిలాఖత్‌కు అదే నిదర్శనమని మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్.ఎస్ విర్క్ వ్యాఖ్యానించారు. దీనా నగర్ కేసులో కుమ్మక్కును అప్పుడే బయటపెట్టి ఉంటే పఠాన్ కోట్ దాడి జరిగి ఉండేది కాదన్నారు. పాక్ నుంచి పంజాబ్‌లో ప్రవేశించిన మత్తుమందులు స్థానిక రాజకీయ నాయకులు, పోలీసుల అండతో మార్కెట్లోకి ప్రవహిస్తున్నాయని చాలాకాలం నుంచి ఆరోపణలు వినవస్తున్నాయి.

కనీసం ఆరుగురు అకాలీ మంత్రులకు మాదక ద్రవ్య మాఫియాతో సంబంధాలున్నాయని పంజాబ్ అంతటా చెవులు కొరుక్కుంటున్నారు. అర్జున అవార్డు పొందిన మల్లయోధుడు, మాజీ డీఎస్పీ జగదీష్ భోలా నాయకత్వంలోని రూ. 700 కోట్ల 'నార్కో' ముఠాను 2014లో విచ్ఛిన్నం చేసినప్పుడు, రాష్ట్ర మంత్రి బిక్రం సింగ్ మజీతియాకు మాదక ద్రవ్య వ్యాపారంతో సంబంధం ఉందని భోలా బయటపెట్టారు. మజీతియా స్వయానా ఉప ముఖ్యమంత్రి సుఖ్ బీర్ సింగ్ బాదల్ బావమరిది. ఇక సుఖ్ బీర్ సాక్షాత్తూ పంజాబ్ ముఖ్యమంత్రి ప్రకాష్ సింగ్ బాదల్ కుమారుడు. మజీతియాకు 2007–2012 మధ్యకాలంలో రూ. 35 లక్షలు లంచంగా చెల్లించానని సింథటిక్ మందుల వ్యాపారి జగ్జిత్ సింగ్ చవాల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కి లిఖితపూర్వకంగా తెలిపాడు. మజీతియాపై ఆరోపణలను కొట్టివేసిన ఉప ముఖ్యమంత్రి సుఖ్ బీర్ బాదల్, సదరు ఆరోపణలు రుజువైతే చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారు.



## ఎన్నికల్లో మాదక ద్రవ్యాల నిధులు

మరోవైపు పోలీసులు, రాజకీయ నాయకుల కుమ్మక్కుతో విజృంభించిన మాదక ద్రవ్య (నార్కో) వ్యాపారం టెర్రరిజానికి నిధులు సమకూరుస్తోందని, మాజీ డీజీపీ శశికాంత్ వివరిస్తున్నారు. 'నార్కో' నిధులను పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ వెచ్చించారని పటియాలా సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ హర్‌దయాళ్ సింగ్ మాన్ నిర్ధారించారు. ఇవాళ 50శాతం మంది పంజాబ్ పోలీసులు మాదక ద్రవ్యాలకు అలవాటుపడ్డారని, వారితో ఆ అలవాటు మాన్పించడానికి ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేశారనీ వార్తలు వస్తున్నాయి.

### 75శాతం యువజనులు డ్రగ్స్ రుచి చూశారు

ఇక పౌర సమాజంలో మాదక ద్రవ్యాలు సృష్టిస్తున్న బీభత్సం అంతా ఇంతా కాదు. భూసార క్షీణం, తరిగిపోతున్న పంట దిగుబడులు, భారీ వ్యవసాయ రుణ భారం పంజాబ్ ఆర్థిక

**ఇటీవల భారత్‌లో నైజీరియా మాదక ద్రవ్య బేహారుల కార్యకలాపాలు పెరగడం గమనార్హం. భారత్, తదితర దేశాలలో మాదక ద్రవ్యాలు విక్రయించగా వచ్చే డబ్బుతో 'బోకో' ఆయుధాలు కొంటోంది. ఇతర టెర్రరిస్టు సంస్థలదీ ఇదే బాణీ. 2014లో టెర్రరిజం వల్ల ప్రపంచవ్యాప్తంగా 32,658 మంది హతమయ్యారు. టెర్రరిజానికీ మాదక ద్రవ్య మాఫియాకూ మధ్యనున్న లంకెపై భారతదేశం అప్రమత్తమవ్వాలి.**

వ్యవస్థను కుంగదీశాయి. ఈ నిరాశామయ వాతావరణంలో యువజనులు మత్తుమందులకు తేలిగ్గా బానిసలైపోతున్నారు. రాష్ట్రంలో 75శాతం యువజనులు మాదక ద్రవ్యాలను రుచి చూశారని అంచనా. నేడు 67 శాతం పంజాబ్ గ్రామీణ కుటుంబాల్లో మాదక ద్రవ్య అలవాటుకు బానిసైన వ్యక్తి కుటుంబానికి కనీసం ఒక్కరైనా ఉన్నారని పంజాబ్ సామాజిక భద్రత శాఖ సర్వే తేల్చింది. 2013లో మాదక ద్రవ్య నిషేధ చట్టం (ఎన్‌డీపీఎస్) కింద దేశమంతటా నమోదైన కేసుల్లో సగం పంజాబ్‌లోనే దాఖలయ్యాయి. 2011లో బీఎస్ఎఫ్ 67 కిలోల హెరాయిన్‌ని స్వాధీనం చేసుకుంటే, 2014లో 324 కిలోలు పట్టుకుంది. దాడులలో పట్టుబడిన మాదక ద్రవ్యాల్లో కేవలం 10శాతాన్ని మాత్రమే పోలీసులు ధ్వంసం చేస్తున్నారని పంజాబ్, హర్యానా హైకోర్టు దృష్టికి వచ్చింది. పోలీసులు తగులబెడుతున్న మాదక ద్రవ్యం కుప్పలు ఆవు పేడ తప్ప మరేమీ కాదని సాక్షాత్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పట్టుబడిన మాదక ద్రవ్యాలు తిరిగి మార్కెట్లోకి ప్రవేశిస్తున్నాయనీ కోర్టు వ్యాఖ్యానించింది.

తాలిబన్, లష్కరే తోయిబాలతో పాటు అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్)లు కూడా మాదక ద్రవ్య వ్యాపారం ద్వారా వచ్చే నిధులను టెర్రరిస్టు కార్యకలాపాలకు వినియోగిస్తున్నాయి. దీంతో పంజాబ్‌తో పాటు యావత్ భారతదేశానికీ ముప్పు పెరగబోతోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే పంజాబ్ మరో మెక్సికోలా మారే ప్రమాదం ఉందని మాజీ డీజీపీ శశికాంత్ హెచ్చరిస్తున్నారు. 2015లో ఒక్క మెక్సికోలోనే మాఫియా హింసాకాండకు 20,000 మంది బలయ్యారు. పఠాన్ కోట్ దాడి తరవాత మెక్సికోలో ప్రపంచ మాదక ద్రవ్య రారాజు జవాకిన్ గుజ్‌మన్ అరెస్టు కావడం కాకతాళీయమే కావచ్చు. కానీ, గుజ్‌మన్ నేతృత్వంలోని సినలోవా మాఫియాకు భారత్, టర్కీలలోని నేరస్థుల ముఠాలతో సంబంధాలున్నాయని అమెరికన్ నిపుణుడు ఎడ్గార్డో బుస్కాగ్లియా వెల్లడించారు. గుజ్‌మన్ ముఠా ఆఫ్ఘనిస్థాన్, టర్కీల నుంచి హెరాయిన్, కొలంబియా నుంచి కొకైన్ కొని అమెరికా, కెనడా, ఐరోపా దేశాల్లో విక్రయిస్తోంది. నేడు ప్రపంచ హెరాయిన్ సరఫరాల్లో 90శాతం అఫ్గనిస్థాన్ నుంచే వస్తోందని బుస్కాగ్లియా తెలియచేశారు.

**ఆయుధాలకు ప్రధాన వనరు?**

అఫ్గనిస్థాన్ నుంచి పాకిస్థాన్ మీదుగా పంజాబ్‌కు నల్లమందు, హెరాయిన్ ధారాళంగా ప్రవహిస్తున్నాయి. ఈ మాదక ద్రవ్యాలతో పాటు పంజాబ్‌లో తయారవుతున్న సింథటిక్ మత్తు మందుల్లో 40-50శాతం అమెరికా, కెనడా, ఐరోపా దేశాలకు అక్రమంగా రవాణా అవుతున్నాయి. కెనడాలోని పంజాబీ మాఫియా మాతృదేశం నుంచి హెరాయిన్, మెక్సికో నుంచి కొకైన్ తీసుకొచ్చి కెనడాలో విక్రయిస్తోంది. ఎనిమిదో దశకం మధ్యనాళ్లలో ఖలిస్థానీ ఉద్యమానికి కెనడా సిక్కులు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఉద్యమ నీడలోనే పాక్ సైనిక గూఢచారి సంస్థ ఐఎస్ఐ పంజాబ్‌లో మాదక ద్రవ్య అక్రమ రవాణాకు తెరలేపింది. పంజాబ్ నుంచి మత్తుమందులు ఢిల్లీ, ముంబయి, గోవా తదితర భారతీయ నగరాలకు ప్రవహిస్తున్నాయి. ఈ వ్యాపారంలో కీలక పాత్ర పోషిస్తున్న దావూద్ ఇబ్రహీం ముఠా 2014లో తన ఊడలను ఆఫ్రికాకు కూడా విస్తరించి నైజీరియాలోని ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ బోకో హరాంతో చేతులు కలిపింది. ఇటీవల భారత్‌లో నైజీరియా మాదక ద్రవ్య బేహారుల కార్యకలాపాలు పెరగడం గమనార్హం. భారత్, తదితర దేశాలలో మాదక ద్రవ్యాలు విక్రయించగా వచ్చే డబ్బుతో 'బోకో' ఆయుధాలు కొంటోంది. ఇతర టెర్రరిస్టు సంస్థలదీ ఇదే బాణీ. 2014లో టెర్రరిజం వల్ల ప్రపంచవ్యాప్తంగా 32,658 మంది హతమయ్యారు. టెర్రరిజానికీ మాదక ద్రవ్య మాఫియాకూ మధ్యనున్న లంకెపై భారతదేశం అప్రమత్తమవ్వాలి. మాదక ద్రవ్య సమస్య కేవలం పంజాబ్‌కు సంబంధించినదనే అపోహను విడనాడి టెర్రరిస్టులతోపాటు మాదక ద్రవ్య మాఫియా పని పట్టడానికీ జోరుగా చర్యలు తీసుకోవాలి.

(ఈనాడు సౌజన్యంతో) ★

# భవిష్యత్తును వణికిస్తున్న కాంబినేషన్...

- రాతియుగపు భావోద్రేకాలు
- మధ్యయుగపు రాజకీయం-తాత్కాలిక ధోరణులు
- అరచేతిలో స్వర్గం చూపుతున్న టెక్నాలజీ




అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చేలా 'పరిమిత వనరుల మధ్య అపరిమిత అవసరాలను తీర్చే' ఆధునిక, హేతుబద్ధ విధానాల రాజ కీయాన్ని తీసుకురావటంలో విఫల మవుతున్న నాయకులు, ఆలోచనాపరుల వల్ల భావి తరాలకు తీరని నష్టం జరగ నుందనే ప్రమాద ఘంటికలు మరింత పెద్ద శబ్దంతో వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల నుంచి బైటపడగల సామాజిక ఆర్థిక వనరులు దేశీయంగా ఉన్నా తగిన సంస్కరణలతో సద్వినియోగం చేసుకోకుండా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ప్రమాదకర ధోరణినే భారత్ మరింత వేగంగా అనుసరించటం ఆందోళన కలిగిస్తోంది.

ఎలాగైనా అధికారం-వీలైనంత దోచుకోవటం లక్ష్యంగా ఓపక్క తాత్కాలిక తాయిలాలిస్తూ మరోపక్క అపరిమిత వనరుల మధ్య అభివృద్ధి అపరిమితం అని నమ్మిస్తున్న ఈ నేతలు అన్ని వర్గాల ప్రజల్నీ ముంచనున్నారు. అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ సుస్థిర అభివృద్ధిని సాధించకుండా.. తాత్కాలిక రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అభివృద్ధిని వేగంగా చూపేందుకు భావితరాల ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారు. పెరిగిపోతున్న అప్పులు, కాలుష్యం, తరిగిపోతున్న వనరులు హెచ్చరిస్తున్నా, తాయిలాల పథకాలతో, విద్వేషాలతో మాయచేస్తూ ఇంకా అనేకరెట్లు అభివృద్ధి ముందుంది అని ఊరిస్తున్నారు.

మన నేతలు చెబుతున్న అభివృద్ధిని తరచిచూస్తే అప్పులే ఎక్కువ. ఇధర్ కా మాల్ ఉధర్, ఉధర్ కా మాల్ ఇధర్ (ఇటు సొమ్ము అటు, అటు సొమ్ము ఇటు మళ్లించటం) మాత్రమే ఎక్కువగా ఉంది. అప్పిచ్చువాడు, వైద్యుడు ప్రపంచానికి అవసరమే అయినా, ఆ అప్పులు వృథా ఖర్చు కోసమే అయితే, భవిష్యత్తుకి ఉపయోగపడటం కోసం కాకపోతే నిండా మునగాల్సి ఉంటుంది. హేతుబద్ధత లేని ఇంధన ధరలు, కరెన్సీల ఎగుడుదిగుడుల మధ్య గత 30-35 ఏళ్లలో తెచ్చిన అప్పులలో 85శాతం కేవలం ఉన్న ఆస్తుల్ని కొనుగోలు చేయటం, వాడుకోవటానికే తప్ప కొత్త వ్యాపారాల్ని, సంపదను పెంచే భారీ ఆవిష్కరణల్ని తీసుకురావటానికి ఉపయోగించలేదు. చాలామంది దగ్గర సంపద తగ్గుతుంటే కొద్దిమంది దగ్గర పెరుగుతోంది తప్ప నూతన సంపద పాలకుల ఉపన్యాసాల్లో కనిపిస్తున్నంతగా వాస్తవంలో కనిపించటం లేదు.

ప్రపంచ దేశాలు ఏటా చేసే ఉత్పత్తి కంటే అప్పు ఈవేళ 280 శాతం ఎక్కువగా, ప్రస్తుతం 200 ట్రిలియన్ డాలర్ల మేర ఉంది. 2008 నుంచే 57 ట్రిలియన్ డాలర్ల మేర పెరిగింది. ఈ అప్పులన్నిటినీ చివరికి చెల్లించాల్సిందే. ఒకవేళ చెల్లించకపోతే, రద్దు చేసేస్తే, ఆ మేరకు పొదుపు కుప్పకూలి ప్రపంచం మరోరకమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుంది. మన విధాన నిర్ణేతలు ఈవేళ్టి కృత్రిమ, అప్రజాస్వామిక అభివృద్ధి కోసం రేపును ఫణంగా పెడుతున్నారు.

**స్థిరత్వానికి, గౌరవప్రదమైన సమాజానికి సంకేతంగా నిలవాల్సిన మధ్యతరగతి ప్రజలు బాధ్యతారహితంగా మారిపోయి హింసామార్గంలోకి ప్రవేశించారు. రూపం మారొచ్చు, కానీ ఈవేళ కూడా అటువంటి ప్రమాదం ప్రపంచస్థాయిలో పొంచి ఉంది. యువత ఈదేశానికి పెద్దసంపద అయినా, మధ్యతరగతి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నా వారిని సరైన దిశలో నిర్మాణాత్మక శక్తులుగా మలిచే ప్రయత్నాలు జరగాల్సిన స్థాయిలో లేవు. రాతియుగపు భావోద్రేకాలు, భారత్ సహా అనేక దేశాల్లో ఇంకా కొనసాగుతున్న మధ్యయుగపు రాజకీయ, పాలనావ్యవస్థలు, తాత్కాలిక ధోరణులు, అరచేతిలో స్వర్గాన్ని చూపే సాంకేతిక పరిజ్ఞానం కలిసి మానవజాతిని అతిపెద్ద సంక్షోభం ముందర నిలుపుతున్నాయని శాస్త్రీయ అధ్యయనవేత్తలు హెచ్చరిస్తున్నారు.**

1929లో వచ్చిన మహా ఆర్థిక సంక్షోభం వల్ల తమ ఉద్యోగాల్ని, మదుపుల్ని పోగొట్టుకున్న సామాన్య ప్రజలే ఫాసిజాన్ని పెంచి పోషించారు. స్థిరత్వానికి, గౌరవప్రదమైన సమాజానికి సంకేతంగా నిలవాల్సిన మధ్యతరగతి ప్రజలు బాధ్యతారహితంగా మారిపోయి హింసామార్గంలోకి ప్రవేశించారు. రూపం మారొచ్చు, కానీ ఈవేళ కూడా అటువంటి ప్రమాదం ప్రపంచస్థాయిలో పొంచి ఉంది. యువత ఈదేశానికి పెద్దసంపద అయినా, మధ్యతరగతి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నా వారిని సరైన దిశలో నిర్మాణాత్మక శక్తులుగా మలిచే ప్రయత్నాలు జరగాల్సిన స్థాయిలో లేవు. రాతియుగపు భావోద్రేకాలు, భారత్ సహా అనేక దేశాల్లో ఇంకా కొనసాగుతున్న మధ్యయుగపు రాజకీయ, పాలనావ్యవస్థలు, తాత్కాలిక ధోరణులు, అరచేతిలో స్వర్గాన్ని చూపే సాంకేతిక పరిజ్ఞానం కలిసి మానవజాతిని అతిపెద్ద సంక్షోభం ముందర నిలుపుతున్నాయని శాస్త్రీయ అధ్యయనవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ప్రపంచ యుద్ధాల గాయాల నుంచి ప్రజానీకం తేరుకునేలా చేసిన పారిశ్రామిక విప్లవం వంటి వాటికి ఇప్పుడు అవకాశాలు కూడా కనిపించటం లేదు. నాలుగోదశ పారిశ్రామిక విప్లవంగా అంటున్న పరిణామం వల్ల వెల్లువలా ఉద్యోగాలు రావు. మరోవైపు, చౌకబారు అహంకార, ఆధిపత్య భ్రమల్ని పెంచుతున్న స్మార్ట్ ఫోన్‌లు ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి తక్షణ సమాధానం చెప్పే స్థాయిలో లేవు. పంట దిగుబడులను పెంచటం, అందరికీ మంచి విద్య, ఆరోగ్యం, ఉపాధి, గ్రామాలు-పట్టణాల మధ్య అంతరాన్ని తగ్గించటం, చేసే పని ఏదైనా గౌరవంగా భావించే సంస్కృతి, చట్టబద్ధ పాలన, పర్యావరణాన్ని పరిరక్షించటం వంటి అంశాలతో సుస్థిర అభివృద్ధిని సాధించటం మీద కన్నా తాత్కాలిక ప్రచారం, తక్షణ సంచలన విజయాల మీదే దృష్టి పెరుగుతోంది.

రోబోల వినియోగం పెరిగితే ఉన్న ఉద్యోగాలు కూడా ఊడిపోయే ప్రమాదం పొంచి ఉంది. దీంతో మెజారిటీ ప్రజల జీవనప్రమాణాలు తగ్గిపోయి, బతుకు సంక్షోభం ఇంకా పెరిగిపోతుంది. దీనివల్ల సాంకేతికను గుప్పెట్లో పెట్టుకునే కొద్దిమంది మినహా అత్యధిక సంఖ్యాక సామాన్యుల జీవితాలు దుర్భరంగా మారతాయి. ముందుచూపుతో, రోబోలు వంటి సాంకేతికతలకు తగ్గ నైపుణ్యాలు పెంచుకునే అవకాశాల్ని యువతకు కల్పించేందుకు ప్రభుత్వాలు ఇంత వరకూ ఎటువంటి చర్యలూ తీసుకోవటం లేదు. అభివృద్ధిని గొప్పగా చూపించటం కోసం.. ఈవేల్టి సమస్యను రేపు చూసుకుందాం, రేపటి తరం మీదకి నెట్టేద్దాం, మనం మాత్రం ఆర్భాటంగా, గొప్ప నేతమనిపించుకుంటూ అప్పులతో, ఇష్టమొచ్చినట్టు వనరుల వాడకంతో బతికేద్దాం అనే నేరసమాన నిర్లక్ష్యం మనదేశంలో మరీ ఎక్కువగా కొనసాగుతోంది. రాబోయే సంక్షోభానికి మన పాలకులు, సమాజం ఏమాత్రం సంసిద్ధంగా లేవు. టెక్నాలజీతో పోటాపోటీగా హేతుబద్ధ వాదనలతో, ముందుచూపుతో సృజనాత్మక పరిష్కారాల కోసం ఆలోచిస్తూ పాలకుల్ని శాసించే సంస్కృతి పెరగటం లేదు.

సాధారణ ప్రజల ఆర్థిక సుస్థిరతను ఆధిపత్య రాజకీయాలు, కేంద్రీకృత పాలన బాగా దెబ్బతీశాయి. ప్రజలు పౌరసత్వం, నాయకత్వంతో రాజకీయాలలో, పాలనలో నిర్మాణాత్మక భాగస్వాములై వ్యక్తిగత జీవితాల్లో ఎదిగేందుకు ముందుచూపుతో తేవాల్సిన సంస్కరణల్ని పాలకులు పట్టించుకోవట్లేదు. వ్యవస్థల పనితీరు మెరుపడాల్సిందిపోయి, క్షీణిస్తోంది. మంచిని ప్రోత్సహిస్తూ చెడును నిరుత్సాహపరిచే ధోరణులు రాజకీయాల్లో మనలేకపోతున్నాయి.

తాత్కాలిక ప్రయోజనాలే పరమావధిగా కొనసాగుతున్న మన ప్రస్తుత అస్థిర అభివృద్ధిలో కేవలం 20-30శాతం మంది మాత్రమే లబ్ధి పొందుతారు, మిగిలినవారు కేవలం తాత్కాలిక తాయిలాల మూలంగా ఉపశమనం పొందుతుంటారు. వారికి సరైన గొంతుక కూడా ఉండదు. ఏదోకరోజు అభివృద్ధిలో ముందున్న 20-30శాతంలాగా తాము కూడా సంపన్నులమై

భోగభాగ్యాలు అనుభవిస్తామని వాళ్లు కలలు కంటుంటారు. కానీ ఆ 70-80 శాతం ప్రజలు మిగిలిన అల్పసంఖ్యాకుల్లా అత్యున్నత స్థాయికి ఎదగటం ఎప్పటికీ సాధ్యం కాదు. ఆ అసాధ్యాన్ని చూపెట్టి ఊరిస్తూ, ఎవరో కొద్దిమంది ఎదిగినప్పుడు విపరీత అనుకూల ప్రచారం చేస్తూ నమ్మించటమే సాంప్రదాయ రాజకీయం, మేధావులు, మీడియా చేసే పని. సమసమాజ విప్లవం పేరుతో హింసను ప్రేరేపించేవారు ఇదే తరహాలో వ్యతిరేక ప్రచారంతో ప్రజల్ని మరో రకంగా భ్రమింపచేస్తుంటారు. భవిష్యత్తులో నష్టం జరిగాక గుర్తించినా బాధిత ప్రజలు నిర్మాణాత్మకంగా స్పందించలేరు.

ఓ ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రభుత్వాలు, సమాజం చేయాల్సింది.. వివక్షల బాధితులకు అదనపు ఏర్పాటు చేస్తూ అందరికీ సమానావకాశాలను కల్పించటం, అందుకోసం నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటివి విధిగా అందించటం. ఈ సుస్థిర అభివృద్ధి నమూనాలో కూడా కొంతమంది మిగిలినవారి కంటే ఉన్నత స్థాయిల్లో ఉంటారుగానీ, కేవలం పుట్టుకతో వచ్చిన అర్హతలతో అందలాలెక్కటం ఉండదు. పేద-ధనిక అంతరాలు పెద్దగా ఉండవు.

ఆకర్షణీయ అభివృద్ధిని చూపిస్తూ తాత్కాలిక లబ్ధి పొందేందుకు ఈవేళ్టి సమస్యల్ని వాయిదా వేసి చేస్తున్న జిలుగుల రాజకీయం, పాలనవల్ల ఎక్కువ నష్టం భవిష్యత్తు తరాలకే ఉంటుంది. ఈరోజు సమస్యల్ని రేపు పరిష్కరించాలనుకోవటం వల్ల మానవజాతి ఎప్పుడూ తీవ్ర మూల్యాన్నే చెల్లిస్తోందని చరిత్రలో బోలెడు ఉదాహరణలు హెచ్చరిస్తున్నా నేతలు, సమాజాన్ని పట్టించుకోవాల్సిన వాళ్లు గుర్తించటం లేదు. అపరిమిత అభివృద్ధి వేగం తాత్కాలికమేనని, అభివృద్ధికి పరిమితులున్నాయని, విజ్ఞతతో వ్యవహరిస్తేనే అందరికీ మనుగడ సాధ్యమని నీరు, ఆహారం, చమురు లాంటి కొరతలతో పాటు పెరుగుతున్న వాతావరణ కాలుష్యం హెచ్చరిస్తున్నా రాజకీయాలు, విధానాలలో మాత్రం మార్పు రావటం లేదు. ఇంకా అపరిమిత వనరుల మధ్య అపరిమిత అవకాశాలు అనే మోసపూరిత విధానాన్నే అనుసరించే పాత రాజకీయాన్నే అనుసరిస్తున్నాం. విస్తరిస్తున్న ఆర్థిక సంక్షోభం క్రమంగా రాజకీయ, సామాజిక సంక్షోభానికి దారితీసి తీవ్రవాద ధోరణులకు దారితీసే ప్రమాదం పెరుగుతోంది.

వాస్తవ ఆర్థిక పరిస్థితి క్షీణిస్తూ, వడ్డీ రేట్లు భారీగా తగ్గిపోతుండటం ఇక విన్యాసాలకు, అంకెల గారడీలకు కూడా అవకాశం లేదని స్పష్టంచేస్తున్నాయి. వనరులు కరిగిపోతుండటం, పర్యావరణ సమస్యలు పెరిగిపోతుండటం అభివృద్ధికి అవరోధాలవుతున్నాయి. ఈ సమయంలో ఇంకా నిర్లక్ష్యం చేస్తే రోగనిరోధక శక్తిలేని శరీరంపై అంటువ్యాధులు దాడిచేసినట్టవుతుంది. ఇతర గ్రహాల మీద బతికేయచ్చు అన్న తాజా ఆకర్షణలు కూడా రక్షించలేవు. కొన్ని దశాబ్దాల తర్వాత వేరే గ్రహాలకు వెళ్లగలిగినా.. తాత్కాలిక ధోరణి, అణచివేత ఆ క్రమాన్ని కూడా సంక్షోభంగా మారుస్తాయి. విదేశాలు, అంతరిక్షం నుంచి వచ్చే ముప్పుకన్నా స్వదేశంలో, భూమ్మీద ఉన్న మనుషుల నుంచే ఎక్కువ ముప్పు భవిష్యత్తుకి పొంచి వుంది.

వాస్తవాల్ని మరుగునపరిచి, తాము ఏది వాస్తవంగా భ్రమింప చేయాలనుకుంటున్నారో దాన్నే నిజమన్నట్టు ప్రచారం చేసే ధోరణుల మధ్య.. నిజం చెప్పేవారికి మొదట ఎక్కువగా ఎదురవుతున్నది విద్వేషం, వ్యతిరేకతే.

ఈతరంలో సమస్యలు వచ్చే తరంవారికి ఉండకూడదు, వీటిని మనం పరిష్కరించి, వచ్చే తరం వారికి వారి కొత్త సమస్యలు, పరిష్కారాలు మాత్రమే ఉండేలా చేద్దామన్నది లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ మొదట్నుంచీ చెప్పే మాట. ఈవేళ్టి అవసరం కోసం రేపటిని ఫణంగా పెట్టటమంటే, మనిషి తన మాంసాన్ని తానే తినటమని తరచూ హెచ్చరిస్తుంటారు. తాత్కాలిక అవసరాలకు, దీర్ఘకాలిక ప్రయోజనాలకు మధ్య సమన్వయాన్ని సాధించే కొత్త, హేతుబద్ధ, నైతిక రాజకీయాన్ని, నాయకత్వాన్ని నిర్మించాలన్నదే తొలి నుంచి లోక్‌సత్తా ప్రయత్నం. పుట్టుకతోనో, యాదృచ్ఛిక సామాజిక పరిణామాలతోనో అవకాశమున్న కొద్దిమంది పాలకులు పైనుంచి దైవదూతల్లా శాసిస్తుంటారు, మెజారిటీ జనం వారి సాయం కోసం యాచకుల్లా ఎదురుచూస్తుండాలి అనే పాత భూస్వామ్య రాజకీయాలు, కార్పొరేట్ దురాశ, బూజుపట్టిన మేధావుల ఆధిపత్య, నియంతృత్వ ధోరణి నుంచి.. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఆర్థిక, అధికార వికేంద్రీకరణ వంటి విధానాలతో ప్రజల్ని ప్రభువులుగా నిలిపి పాలకుల్ని సేవకులుగా చేసే కొత్త జన రాజకీయం వైపు మనం ఎంత త్వరగా మారితే అందరి భవిష్యత్తూ అంత సురక్షితంగా ఉంటుంది.

(సోర్స్: సత్యజిత్ దాస్) ★

# ఓ ఎంపీ అభ్యర్థి రూ.100 కోట్లు ఎలా ఖర్చు పెట్టాడంటే నిజం చెప్పడానికి సిగ్గేసింది

## నాయకులు రాజకీయాల మీద బతకడం మానేస్తే రాజకీయాలు బాగుపడతాయి

## అమెరికా, ఐరోపాల్లో మేధావుల కొరత.. కరవైన ప్రేరణ




ఆంధ్రప్రదేశ్‌లో ఓ ఎంపీ అభ్యర్థి ఎన్నికల్లో రూ.100 కోట్లు ఖర్చు పెట్టాడని తెలిసి మా జర్మనీ మిత్రులు ఆశ్చర్యపోయారు. ఐదేళ్లలో ఎంపీగా వేతనభత్యాలు రూ. 2–3కోట్లేగా వచ్చేది? అని ప్రశ్నించారు. నిజం చెప్పడానికి సిగ్గేసింది. జర్మనీలో రాజకీయాలు ఇలా ఉండవు. మేయర్ ఎన్నికల్లో నాకు వెయ్యి యూరోలు ఖర్చయ్యాయి. భారీ సభలు, ప్రసంగాలు కనిపించవు. ఓటర్లు ఈ–మెయిల్స్ ద్వారా ప్రశ్నలడిగితే అభ్యర్థులు సమాధానమిస్తారు. నాయకులు రాజకీయాల మీద బతకడం మానేస్తే రాజకీయాలు బాగుపడతాయని నా నమ్మకం.

30, 20, 10 ఏళ్ల క్రితం చూసిన భారత్ నేడు కనిపిస్తున్నది ఒకటి కాదు. నేను ప్రతి రెండేళ్లకూ ఓసారి వస్తున్నాను. 20 ఏళ్ల క్రిందట ఢిల్లీలోని నా మిత్రుడు స్వచ్ఛంద సంస్థల కోసం చిరిగిన చెప్పులతో తిరిగేవాడు. ఈవేళ బెంజ్ కారులో ప్రయాణిస్తున్నాడు. ఆ డబ్బు ప్రజలదే. పేదలు అలాగే ఉండిపోగా, ధనవంతులు మరింతగా పెరిగిపోతున్నారు. మధ్యతరగతి పరిస్థితి కాస్త మెరుగైంది.

పేదరికానికి భారత్, ఐరోపాలలో వేర్వేరు కొలమానాలున్నాయి. యాచకులు, దరిద్రులను జర్మనీలో పేదలు అంటారు. ఐరోపాలో ఇల్లు, కారు ఉన్నా చేయడానికి ఉద్యోగం లేకపోతే పేదలుగానే పరిగణిస్తారు.

జర్మనీలో అన్నీ ప్రభుత్వాసుపత్రులే. మందుల్ని వృథా చేయరు.

నగర పన్నులన్నీ కేంద్రానికి వెళ్తే నగరవాటాని తిరిగి పంపుతారు. ఏమేం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలి అనేది ప్రజలందరూ కలిసి చర్చించి నిర్ణయిస్తారు.

జర్మనీకి వలసలు విస్తరించాయి. ఎనిమిది కోట్ల జనాభాలో పెన్షనర్లు పెరుగుతున్నారు. వారికి పింఛను కావాలంటే పనిచేసే యువత కావాలి కదా.. అందుకే కొన్ని సమస్యలున్నా వలసల్ని ఆహ్వానించారు. జర్మనీలో వ్యక్తిగత జీవితానికే ప్రాముఖ్యం. యుక్తవయసు రాగానే పిల్లలు సొంత కాళ్లపై నిలబడతారు. అన్నీ బాగున్నా ఐరోపా దేశాల్లో జనాభా పెరగడం లేదు.

సంఘర్షించే ఆలోచనలతో ప్రజల్లో ప్రచారం చేసే పౌరసమాజం ఏ దేశానికైనా కీలకం. కానీ అమెరికా, ఐరోపా దేశాల్లో మేధావులకు కొరత ఏర్పడింది. ఆ ప్రజలకు ప్రేరణ కరవైంది. అందరికీ మంచి చదువు, కారు, ఇల్లు లభిస్తున్నాయి. తదుపరి లక్ష్యాలను ఎలా విస్తరించుకోవాలో, ఎందుకోసం తపించాలో వారికి తెలియటం లేదు. బాగా చదవాలనే ఆశలు లేవు. టెన్త్, ఇంటర్ పూర్తి చేసి ఉద్యోగంలో చేరిపోతారు. అందుకే భారత్‌లోని పరిస్థితులను అవకాశంగా తీసుకుని ఉన్నత విద్యావంతుల్ని ఆ దేశాలకు పెద్దసంఖ్యలో ఆకర్షిస్తున్నారు. అవకాశాలు వస్తే ఐరోపావారిని మించి సత్తా చూపగలమని మన విద్యార్థులు రుజువు చేస్తున్నారు.

(కర్టెసీ: ఈనాడు)

**- డా॥ గుజ్జుల రవీంద్ర**

*ప్రవాస భారతీయుడు, జర్మనీలో మేయర్‌గా, ఎంపీగా సేవలందించిన రాజకీయవేత్త*

★

# ఉపాధ్యాయ పోస్టులకు తప్ప చదువుకు డిమాండ్‌లేని సర్కారీ విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే ప్రతిపాదనలేనా ఇవి?

ప్రత్యేకమైన చట్టాలు అక్కర్లేకుండానే చాలా దేశాలు అందరికీ మంచి విద్యను అందించాయని, విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) అనేది ప్రచారానికి తప్ప ఉపయోగ పడదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 2009లో ఆ చట్టం వచ్చినప్పుడే పలు వేదికల మీద స్పష్టంగా చెప్పారు. కేవలం నమోదు మీద కాకుండా, నాణ్యమైన పాఠశాల విద్యను అందించేందుకు, ఉన్నత విద్యను ఆసక్తి గల ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చేందుకు విప్లవాత్మక సంస్కరణల్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆర్‌టీఈ అమల్లోకి వచ్చాక పరిస్థితిని సమీక్షించుకుంటే లోక్‌సత్తా వాదనే వాస్తవమని రుజువైంది. 2007-09 నాటికి 2015 నాటికి ప్రభుత్వ పాఠశాల్లో ఎనిమిదవ తరగతి వరకు పిల్లల నమోదు 9శాతం పడిపోయింది (13.37 కోట్ల నుంచి 12.19 కోట్లకి). ఇదేసమయంలో ప్రయివేటు పాఠశాలల్లో పిల్లల నమోదు 40 శాతం మేర పెరిగి 5.09 కోట్ల నుంచి 7.12 కోట్లకు చేరింది. ప్రయివేటు రంగాన్ని తగ్గించి పేదలను ఆదుకోవాలన్న లక్ష్యంతో ఉన్నట్టు కనిపించే ఆర్‌టీఈ ఆచరణలో మాత్రం ప్రయివేటు రంగానికి ఉపయోగపడుతూ, పేదల మీద విద్యాభారాన్ని మరింత మోపింది.



అన్ని రకాల పరీక్షల్ని నిషేధించి, పిల్లలు నేర్చుకున్న విషయాల్ని ఆహ్లాదకరమైన వాతావరణంలో బేరీజు వేసే విధానాలు లేకుండా చేసిన ఆర్‌టీఈ, చివరికి ఓ లైసెన్స్ రాజ్యాన్ని స్కూలు విద్యావ్యవస్థలో తయారుచేసింది. దీనివల్ల మంచి చదువుతో సంబంధం లేకుండా ప్రైవేటు స్కూళ్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతూ పేదలకు భారమైన రీతిలో ఫీజుల్ని పిండేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌టీఈని సమూలంగా మార్చి తల్లిదండ్రుల మీద భారం లేకుండా ప్రతి బిడ్డకూ మంచి చదువును అందించేలా సంస్కరించాల్సిన అవసరం ఉంది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ వాదనల్ని గుర్తించింది గానీ, విద్యాహక్కు చట్టంలోని లోపాల్నే ఇంకోరకంగా కొనసాగించే సవరణల్నే ప్రతిపాదించింది.

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం విద్యాహక్కు చట్టంలో కొన్ని సవరణల్ని ప్రతిపాదించి నట్టు సమాచారం. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలన్న నిబంధనని ఆర్‌టీఐ నుంచి తొలగించాలన్నది తెలంగాణ సర్కారు చేసిన ఒక ప్రతిపాదన. ఈ విభాగంలో చేరే పిల్లల ఫీజుల్ని ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ రిజర్వేషన్ల వల్ల ప్రభుత్వ బడుల్లో చదివేవారు కరవవుతారని, సర్కారు బడులు మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని, అదే జరిగితే వేలకోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన మౌలిక వసతులు వృధా అవుతాయని, ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని తెలంగాణ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ 25శాతం రిజర్వేషన్ల వల్ల నాణ్యత లేని బడులు పుట్టగొడుగుల్లా

పుట్టుకొస్తాయని పేర్కొంది. అయితే, సర్కారీ బడి వ్యవస్థలో యధాస్థితిని కొనసాగించాలనే ఆతురతలో తెలంగాణ ప్రభుత్వం వాస్తవాల్ని గుర్తించినట్టు కనిపించటం లేదు. ఆర్‌టీఐతో వచ్చిన 25శాతం రిజర్వేషన్లు సక్రమంగా అమలుకాకున్నా కూడా పేద, దిగువ మధ్యతరగతివారు ప్రయివేటు స్కూళ్లలోకి పెద్దఎత్తున తమ పిల్లల్ని చేరుస్తున్నారన్నది వాస్తవం. ప్రభుత్వ తీరు ఆర్‌టీఈని ఇంకా లైసెన్స్ రాజ్య వ్యవస్థగా మార్చి అవినీతిని, పేద కుటుంబాల మీద ఆర్థిక భారాన్ని పెంచేలా ఉంది తప్ప పేద, గ్రామీణ బిడ్డలకు నాణ్యమైన చదువును అందుబాటులోకి తెచ్చేలా లేదు.

ఈ 25శాతం రిజర్వేషన్‌కు చెల్లించే మొత్తంతో సంబంధం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వాలు స్కూలు విద్య మీద ఏటా రూ. 2,00,000 కోట్ల పైచిలుకు ఖర్చు చేస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తర్వాత తెలంగాణ ప్రభుత్వం కూడా ఒక్కో విద్యార్థి మీదా నెలకి రూ. 20,000–25,000 దాకా ఖర్చు చేస్తోంది. అయితే ఫలితాలు ఎలా ఉన్నాయో హైదరాబాద్‌లో స్వయంగా 2014లో తెలంగాణ ఏర్పాద్దాక రాష్ట్ర ప్రభుత్వం చేయించిన సర్వేలోనే తేటతెల్లమయ్యాయి.

హైదరాబాద్‌లోని ప్రయివేటు స్కూళ్లలో జరిపిన ప్రాథమిక సర్వే ప్రకారం, చాలామంది ఉపాధ్యాయులకు సరైన బోధనా అర్హతలు లేవు. పాఠ్యాంశాలు, పరీక్షా పద్ధతులలో మార్పుల గురించి వారికి అవగాహన లేదు. హైదరాబాద్ సహా ఐదు జిల్లాల్లో సుమారు 5,000 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సర్వే వివరాల ప్రకారం, 70 నుంచి 80శాతం మంది టీచర్లకి పాఠ్యాంశాలు, పరీక్షా పద్ధతులలో మార్పుల గురించి తెలియదు. హైస్కూలు విద్యార్థుల్లో 45శాతానికి తెలుగు చదవటం, రాయటం రాదు. 60 నుంచి 80శాతం మందికి ఇంగ్లిష్ చదవటం, రాయటం రాదు. 50శాతం విద్యార్థులకు మామూలు అంకగణితం లెక్కలు చేయటం కూడా రాదు. పేరొందిన పలు ప్రయివేటు పాఠశాలల్లో కూడా మౌలిక వసతులు సరైన ప్రమాణాలతో లేవని ఈ సర్వేలో తేలింది.

తెలంగాణ సహా యావత్ గ్రామీణ భారతంలో చదువు స్థితిగతులపై 'అసర్' విడుదల చేసిన తాజా సర్వేల్లోని వివరాలు కూడా దాదాపు ఇదేరీతిలో ఉన్నాయి. ఎన్‌రోల్‌మెంట్ కాగితాల్లో నూరుశాతం దాకా కనిపిస్తున్నా, విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని సర్వే తెలిపింది. 2010లో ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో 33.2శాతం మంది తీసివేతల్ని చేయగా, ప్రైవేటు స్కూళ్లలో 47.8శాతం చేశారు. క్రమంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల మధ్య ఈ శాతంలో తేడా పెరిగింది. అయితే రెండు చోట్లా ప్రమాణాలు తగ్గాయి. 2013లో అటువంటి మామూలు తీసివేతను ప్రభుత్వ స్కూళ్లలో 18.9శాతం మంది విద్యార్థులు చేయగా, ప్రైవేటు పాఠశాలల్లో 44.6శాతం మంది చేయగలిగారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఐదవ తరగతి విద్యార్థుల్లో సగానికిపైగా మూడవ తరగతిలో ఉండే మామూలు భాగాహారం చేయలేకపోతున్నారు. దేశవ్యాప్తంగా గ్రామాల్లోని సర్కారీ బడుల్లో ఒకటి నుంచి ఐదవ తరగతి చదివేవారిలో 68.4శాతం ప్రైవేటు ట్యూషన్ల కోసం నెలకి రూ. 100 వరకూ కడుతున్నారు. ప్రైవేటు స్కూళ్లలో చదివే పిల్లలు ట్యూషన్ల కోసం నెలకి రూ. 100–200 చెల్లిస్తున్నారు.

సమస్య.. నిధులు, ప్రైవేటు స్కూళ్లు కాదు. ప్రభుత్వ పాఠశాల విద్య అత్యంత నాసిరకంగా తయారైంది. ఉపాధ్యాయ పోస్టులకు భారీ డిమాండ్, సిబ్బందికి భారీ జీతాలు తప్ప విద్యార్థుల నమోదు నానాటికీ తీసికట్టయ్యే తరహాలో ఆ వ్యవస్థను తయారు చేశారు. అలాంటి అసమర్థ వ్యవస్థని కొనసాగించేలాగానే తెలంగాణ ప్రభుత్వం ఆర్‌టీఈ సంస్కరణల్ని ప్రతిపాదించింది. ప్రభుత్వ పాఠశాలల పట్ల తీవ్ర విముఖతతో కొంతైనా మెరుగ్గా చదువు చెబుతారని, భారమైనా చాలామంది తల్లిదండ్రులు పిల్లల్ని ప్రయివేటు స్కూళ్లకు పంపుతున్నారు. చాలా ప్రయివేటు పాఠశాలల్లో కూడా పెద్ద గొప్పగా ఏమీ చదువు అందటం లేదని సర్వేలే చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చేయాల్సింది ప్రయివేటు స్కూళ్లని నిబంధనల పేరుతో అణగదొక్కి ప్రభుత్వ స్కూళ్లు తప్ప దిక్కు లేదు అనే పరిస్థితిని తేవటం కాదు. ప్రభుత్వ పాఠశాలలు సవ్యంగా లేనప్పుడు ప్రయివేటు స్కూళ్ల మీద ఆంక్షలు పెరిగిన కొద్దీ లంచాలు పెరుగుతాయి తప్ప సమస్య పరిష్కారం కాదు.

ప్రతి బిడ్డకీ నాణ్యమైన విద్యను అందించటమే వ్యవస్థ లక్ష్యం కాబట్టి, ప్రభుత్వ–ప్రయివేటు పాఠశాలల మధ్య ఎంచుకునే స్వేచ్ఛని కల్పించి ఎంచుకునే అవకాశాన్ని తల్లిదండ్రులకు కల్పించటమే ప్రభుత్వం ఇప్పుడు చేయాల్సింది. ప్రభుత్వ విద్యాసంస్థల్ని నాశనం చేసిన పాపానికి ఇంతకంటే పరిష్కారం లేదిప్పుడు. కాస్త చెప్పుకోదగిన ప్రయివేటు పాఠశాల్ని కూడా ప్రభుత్వమే ప్రోత్సహించి ఆ స్థాయి ఫీజుల్ని రీఇంబర్స్‌చేస్తే

తల్లిదండ్రుల మీద భారం తగ్గుతుంది. అదేసమయంలో విద్యావ్యవస్థలో నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు ప్రామాణిక చర్యల్ని చేపట్టాలి. బోధన, ఉపాధ్యాయుల హాజరు, పర్యవేక్షణ, విద్యార్థులు ఆస్వాదించగలిగేరీతిలో బేరీజు వేయటం, తల్లిదండ్రులకు భాగస్వామ్యం, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చటం వంటి చర్యల ద్వారా పనికిమాలిన ప్రయివేటు స్కూళ్లకు కళ్లెం పడి, క్రమంగా ప్రభుత్వ పాఠశాలలు పుంజుకుంటాయి. విద్యాహక్కు చట్టం ప్రక్షాళన ఈ మార్పులకు తగ్గట్టు ఉండాలి. అంతేతప్ప, ఆర్‌టీఈలో సవరణల పేరుతో మసి పూసి మారేడు కాయ చేసి పాత లైసెన్స్ రాజ్యాన్నే కొనసాగిస్తూ, ప్రభుత్వ పాఠశాలలు పుంజుకున్నదాకా పిల్లల భవిష్యత్తు ఫణంగా పెడతామంటే మాత్రం సహించకూడదు.

ఇక ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలోనే ప్రాథమిక విద్యను అందించేలా దేశవ్యాప్తంగా నిర్ణయాన్ని అమలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని కోరటం వంటి ప్రతిపాదనలు కూడా రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనాన్ని బైటపెట్టేవే. 5వ తరగతి వరకూ తెలుగు మాధ్యమంలోనే చెప్పటం వల్ల పిల్లలకు చాలా మేలు, ఆంగ్లం ఒక సబ్జెక్ట్‌గా ఉంటే చాలు అనటంలో సందేహం లేదు. ఈ వాస్తవాన్ని ప్రచారంలో ఆరితేరిన తెలంగాణ ప్రభుత్వం తల్లిదండ్రులకు చెప్పి ఒప్పించే ప్రయత్నం ఎందుకు చేయలేదు? ప్రభుత్వ విద్యావ్యవస్థకు విశ్వసనీయతను సమకూర్చే సత్తా, అందుకు తగ్గ చర్యలు లేకుండా ప్రైవేటు వారిని కట్టడి చేద్దామనుకోవటం వల్ల దీర్ఘకాలంలో ప్రతికూల ఫలితాలు వస్తాయి.

అందరికీ మంచి విద్య, వైద్యం పూర్తిగా ప్రభుత్వ బాధ్యత. ఏదోకరకంగా పెత్తనం చేయటానికి, ఏదో చేస్తున్నామన్న భ్రమను ప్రజల్లో కలిగించడానికి ప్రభుత్వం ప్రయత్నించకుండా ప్రభుత్వ-ప్రయివేటు పాఠశాలల మధ్య ఎంచుకునే స్వేచ్ఛని కల్పించి నాణ్యతా పర్యవేక్షణకు, ప్రభుత్వ విద్యావ్యవస్థ విస్తరణకే ప్రభుత్వం పరిమితమైతే విద్యారంగం బాగుపడి తెలంగాణలోని బిడ్డలందరికీ తల్లిదండ్రుల మీద భారం లేకుండా మంచి బడి చదువు అందుతుంది. ★

# ఏపీలో పెరిగిన అత్యాచారాలు, ఆర్థిక, సైబర్ నేరాలు

తెలంగాణలోలాగానే ఆంధ్రప్రదేశ్‌లో 2015లో నేరాలు తగ్గి మహిళలపై అత్యాచారాలు పెరిగాయి. 2014లో అన్నిరకాల నేరాలకు సంబంధించి ఏపీలో 99,161 కేసులు నమోదుకాగా, 2015లో ఆ సంఖ్య 94,968గా ఉంది. మహిళలపై అత్యాచారాలు మాత్రం 10.21శాతం పెరిగాయి. అలాగే ఏపీలో నేరాలు కొత్త రూపు దాల్చుకుంటున్నాయి. ఆర్థిక, సైబర్ నేరాలు పెరిగాయి. సైబర్ నేరాల సంఖ్య 2015లో 636కాగా, అంతకుముందు ఏడాది 410. ఇందులో విశాఖపట్నం పరిధిలోనే 326 ఉన్నాయి. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో నమోదైన 300కిపైగా కేసులు కూడా గత ఏడాది కంటే రెట్టింపు. అలాగే ఎస్సీ, ఎస్టీలపై నేరాలు కూడా పెరిగాయి. 2014లో 1850 కేసులు నమోదుకాగా, తర్వాతి సంవత్సరం 1917 నమోదయ్యాయి. ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు అత్యధికంగా 43.9శాతం పెరిగాయి.

# మందుతోనే ముందుకు పోదాం

ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించి కఠిన మద్య నియంత్రణను అమలు చేయాలన్న లోక్‌సత్తా విధానాన్నే తొలుత అనుసరిస్తున్నట్టు బిల్డప్ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం మద్యాన్ని భారీ నుంచి అతిభారీ ఆదాయ వనరుగా తయారుచేస్తోంది.

విజయవాడలో మల్లాది విష్ణుకు చెందిన బార్‌లో జరిగిన కల్తీ మద్యం విషాదం ప్రభుత్వ దివాళాకోరు విధానానికి మచ్చుతునక మాత్రమే. 2004-05లో ఏపీలోని 13 జిల్లాల పరిధిలో ప్రభుత్వానికి రూ.2,367 కోట్ల ఆదాయంరాగా, 2014-15 అది 10,927 కోట్లకు చేరుకుంది. పదేళ్ల వ్యవధిలో రూ.8,560 కోట్లు పెరిగింది. ప్రభుత్వానికి అందే ఆదాయం విలువపై మద్యం దుకాణాలు, బార్ల యాజమాన్యాలు వాటి కమీషన్ జత చేసి అమ్ముతుంటాయి. దుకాణాల్లో గరిష్ఠ ధర ఉల్లంఘనలు యధేచ్ఛగా జరుగుతున్నా పర్యవేక్షణ దాదాపు శూన్యం. వీటిని కట్టడి చేసే ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేయటం లేదు. ప్రాణాలు పోతున్నా, నేరాలు పెరుగుతున్నా మందుతోనే ముందుకు అని ఏపీ సర్కారు నిస్సిగ్గుగా రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తూ వ్యవహరిస్తోంది.

# దోషులపై చర్యలూ లేవు, రుణవ్యవస్థను బాగుచేసే సవరణలూ లేవు


కరీంనగర్ ప్రధాన కేంద్రంగా వడ్డీ వ్యాపారంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై వేధింపులకు పాల్పడ్డ ఏఎస్సై మోహన్‌రెడ్డి కేసులో దోషులపై చర్యలుంటాయనే నమ్మకం క్రమంగా సన్నగిల్లుతోంది. ఈ కాబూలీ వడ్డీ వ్యాపారంలో భాగస్వాములైన అధికారులెవరిపైనా చర్యలు తీసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి కనిపించటం లేదని, సీఐడీ సమర్పించిన నివేదికను తుంగలో తొక్కేస్తారని చెబుతున్నారు. వ్యవహారంతో సంబంధముందని సీఐడీ పేర్కొన్న అధికారుల పట్ల ప్రభుత్వం అంత ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఒకవేళ పేరుకి సీఐడీ అభియోగాలు దాఖలు చేసినా, సాక్ష్యాల్ని బలహీనపరుస్తారనే అనుమానాలు బలపడుతున్నాయి. నా ఏసీబీ, నా పోలీసులు అనే కేసీఆర్ ప్రభుత్వం.. ఓటుకు కోట్లు కేసులోలాగానే ఈ కేసును కూడా నీరుగార్చాలని నిర్ణయించుకున్నట్టుగా పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. బాధితులకు రాజీ మార్గంలో సెటిల్ చేసి, ఒకరోఇద్దరో దిగువస్థాయిలోవారికి నామమాత్రపు శిక్షలు విధించి బడాబాబులను మాత్రం తప్పిస్తారు.

మరోవైపు, అప్పు పుట్టేందుకు సరైన మార్గం లేకపోవటం వల్లే ప్రజలు ఇలా కాబూలీవాలాల బారిన పడుతున్నారు, తేలిగ్గా, తక్కువ వడ్డీకి రుణమందించే వ్యవస్థని తయారుచేద్దాం అనే ఆలోచనను కూడా సర్కారు చేయటం లేదు. ఈ కేసులో బాధితులు లోక్‌సత్తా ఉద్యమ నేత ఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో జయప్రకాష్ నారాయణ్‌ని కలిసినప్పుడు, పరపతి వ్యవస్థను బాగుచేయటానికి తెలంగాణ ప్రభుత్వం వెంటనే తగిన చట్టసవరణను చేయాలని కూడా లోక్‌సత్తా స్పష్టమైన విజ్ఞప్తిని చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కాల్‌మనీ వికృతరూపాన్ని చూశాక కూడా తెలంగాణ ప్రభుత్వం వ్యవస్థీకృతంగా స్పందించకుండా భూస్వామి తరహాలోనే వ్యవహరిస్తోంది. ★

# నూతన విద్యుత్ విధానానికి ఆమోదం

శుద్ధ ఇంధనాన్ని, సత్వర పెట్టుబడుల్ని ప్రోత్సహించడంతోపాటు విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కం)ల నియంత్రణకు వీలు కల్పించే నూతన విద్యుత్ విధానానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రస్తుతమున్న విద్యుదుత్పత్తి కర్మాగారాలు 100శాతం విస్తరణ చేసుకోవటానికి ఈ నిర్ణయం వీలు కల్పిస్తుంది. తద్వారా ఖర్చు తగ్గటంతోపాటు అనుమతులు విడిగా తీసుకోవాల్సిన అవసరం చాలామేరకు తగ్గుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ పునరుత్పాదక ఇంధనాలను వినియోగించుకోవడానికి, తద్వారా స్వచ్ఛ భారత్‌కి ఊతమివ్వడానికి నూతన విధానం తోడ్పడుతుంది. విద్యుదుత్పత్తి కర్మాగారాలు తమ వద్దనున్న మిగులు విద్యుత్తును సంబంధిత ఎక్స్ఛేంజీల ద్వారా అమ్ముకునేందుకు అనుమతి లభించనుంది. ఈ ఆదాయాన్ని విద్యుదుత్పత్తి సంస్థలు, డిస్కంలు పంచుకుంటాయి. నగరాలు, పట్టణాల నుంచి మురుగునీటిని శుద్ధి చేసిన తర్వాత విద్యుదుత్పత్తి కర్మాగారాలు వినియోగించటం ఈ విధానంలో తప్పనిసరి. చెత్త నుంచి తయారయ్యే విద్యుత్తునంతటినీ డిస్కంలు కొనుగోలు చేయకతప్పదు. అందుబాటు ధరలో అందరికీ నిరంతర విద్యుత్తును అందించి, పెట్టుబడులను ఆకట్టుకోవటం లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్తును కొన్ని రాష్ట్రాలు కొనుగోలు చేయకపోవటం వల్ల కర్మాగారాలు పూర్తి సామర్థ్యంతో పనిచేయలేక స్థిర వ్యయాలు పెరుగుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్తును ఎక్స్ఛేంజీలలో అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నారు. పంపిణీ లైన్లనూ వేలం వేస్తారు. సూక్ష్మ గ్రిడ్‌లను ఏర్పాటు చేసి మారుమూల గ్రామాలకూ విద్యుత్తు అందిస్తారు. బగ్గు గనులున్న చోటే చిన్న తరహా విద్యుదుత్పత్తి కర్మాగారాలు పెడతారు. ఇలా తూర్పు రాష్ట్రాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తారు. 2022 నాటికి మొత్తం విద్యుత్తులో 8శాతం సౌర శక్తి ద్వారా సాధించటం ప్రభుత్వ లక్ష్యం. ★

# ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవ పరిస్థితులకి, ప్రచారానికీ పొంతన కుదరటం లేదు: సీఎంఎస్



**స్వచ్ఛ భారత్ పేరుతో భారీగా కార్యక్రమాలు చేస్తున్నట్టు కనిపిస్తుంది కానీ, ప్రచారం తప్ప క్షేత్రస్థాయిలో పని మాత్రం కనిపించటం లేదని భాస్కరరావు అన్నారు. విశాఖ అనగానే అందరికీ గుర్తొచ్చే రామకృష్ణా బీచ్‌లోనే పరిస్థితులు చూస్తే బాధేస్తుందన్నారు. అక్కడ కిలోమీటరున్నర దూరంలో రెండు టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయన్నారు. కనీసం తాగునీరు అందుబాటులో లేదు, చెత్తకుండీలు సైతం లేవన్నారు. రాష్ట్రంలో ఏ పని చూసుకున్నా కాంట్రాక్టర్ల పర్వమే నడుస్తోందన్నారు.**

ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవ పరిస్థితులకు, ప్రచారానికీ పొంతన కుదరట్లేదని, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి 20 నెలలవుతున్నా ఏ రంగంలోనూ ఆశించిన ప్రగతి కనిపించటం లేదని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) ఛైర్మన్ ఎన్. భాస్కరరావు వ్యాఖ్యానించారు. ఏపీలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఇటీవల సీఎంఎస్ పలు జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని సమీక్షించిందని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ తెలిపారు. ఏపీ ప్రభుత్వ పంథా ఇలానే కొనసాగితే ప్రజల ఆకాంక్షలు నెరవేరటం కష్టమన్నారు.

ఏపీలో మిగులు విద్యుత్తుని ఇతర రాష్ట్రాలకు అమ్ముతున్నామని చెబుతున్న ప్రభుత్వం రైతులకు 9గంటల విద్యుత్తుని ఇవ్వలేకపోతోందని, పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వకుండా దళారులు దోచేస్తున్నా సర్కారు పట్టించుకోవటం లేదని కృష్ణా, చిత్తూరు జిల్లాల పర్యటనలో తమ దృష్టికొచ్చిందని భాస్కరరావు తెలిపారు.

ఏపీలో సర్కారీ విద్యకు ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. ప్రభుత్వ పాఠశాలల మీద ఖర్చు చేస్తున్న గణనీయ నిధులతో చదువులో నాణ్యతా ప్రమాణాలను పెంచే చేసే ప్రయత్నం చేయకుండా మంత్రులే ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తున్నారన్నారు.

స్వచ్ఛ భారత్ పేరుతో భారీగా కార్యక్రమాలు చేస్తున్నట్టు కనిపిస్తుంది కానీ, ప్రచారం తప్ప క్షేత్రస్థాయిలో పని మాత్రం కనిపించటం లేదని భాస్కరరావు అన్నారు. విశాఖ అనగానే అందరికీ గుర్తొచ్చే రామకృష్ణా బీచ్‌లోనే పరిస్థితులు చూస్తే బాధేస్తుందన్నారు. అక్కడ కిలోమీటరున్నర దూరంలో రెండు టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయన్నారు. కనీసం తాగునీరు అందుబాటులో లేదు, చెత్తకుండీలు సైతం లేవన్నారు.

రాష్ట్రంలో ఏ పని చూసుకున్నా కాంట్రాక్టర్ల పర్వమే నడుస్తోందన్నారు.

ఇటీవల విశాఖలో నిర్వహించిన పారిశ్రామిక సదస్సులో భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రకటించినా, వాటిలో అమలయ్యేది చాలా తక్కువన్నారు. అసాధ్యమైన ఒప్పందాలన్నీ చేసుకోవటంతో ప్రసార సాధనాల్లో విస్తృత ప్రచారం వచ్చిందన్నారు. ఇలా చేయడం వల్ల నకిలీ ప్రగతి కనిపిస్తుంది తప్ప నిజమైన ప్రగతి ఉండదన్నారు. ఏపీలో అమలవుతున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై వివిధ రంగాల ప్రముఖులతో కూడిన తమ జాతీయ ప్యానల్ ప్రజల వద్దకు వెళ్లి తెలుసుకుంటుందని భాస్కరరావు తెలిపారు. ★

# పిల్లల పెంపకం
# ఆధునిక మహిళకు కావాలి అదనపు సామర్థ్యం


- ఎ. అన్నపూర్ణ

పెత్తందారీ పురుషాధిక్య రాజకీయం–సమాజంలో ఇంకా సమూల మార్పు రాకపోవటం, సాంకేతికతతో వేగంగా విస్తరిస్తున్న ప్రపంచీకరణ వల్ల నేటి తరం చదువుకున్న మహిళలు సైతం పిల్లల పెంపకం విషయంలో అనేక సమస్యలను ఎదుర్కోవలసి వస్తోంది. అందులోనూ ఉద్యోగినులైతే మరింత వేదనకు గురి అవుతున్నారు. ఉద్యోగ నిర్వహణలో పిల్లల చదువు ఇష్టాలు తెలుసుకుని వారితో గడపటం సాధ్యం కావడం లేదు. స్కూలు ఫీజులు వేలల్లో మొదలై లక్షలకు చేరుతున్నాయి. ఈ కారణంగా ఉద్యోగమూ తప్పటం లేదు. ఆధునిక టెక్నాలజీ, ఐఫోన్ల ఆకర్షణల ప్రతికూలతల్లో పిల్లలు ఏమైపోతారో అనే ఆందోళన ఆమెను కుంగదీస్తున్నాయి. ఇంటర్నెట్‌కి అంకితమైపోతున్న పిల్లల పట్ల కఠినచర్యలు తీసుకుంటే, వారు తల్లిదండ్రుల మీద ద్వేషాన్ని పెంచు కుంటారేమో, స్వేచ్ఛ ఇస్తే అది దేనికి దారితీస్తుందో! అనే భయం. పరిష్కారంగా హాస్టల్స్‌లో ఉంచేవారున్నారు. టీనేజ్ పిల్లల దైహిక సంఘర్షణలు ఆకర్షణలూ భద్రత సమస్యగా తయారవుతున్నాయి. గ్రామీణ వాతావరణం ఎక్కువగా ఉండే గతకాలంలో ఇంటి దగ్గర పిల్లలను పెద్దలు జాగ్రత్తగా కనిపెట్టి ఉండేవారు. అలాంటి పెద్దలు ఉన్నప్పటికీ ఈరోజుల్లోవారికి సరిపడదు. ఇంటి దగ్గర ఉంటున్న మహిళలు పిల్లలపై ఊపిరిసలపనంత దినచర్యను రుద్దుతున్నారు. ఉదయం స్కూలు తర్వాత ఏదో ఒక యాక్టివిటీ ఉండాలని డ్యాన్స్ లేదా సంగీతం వంటి వాటికి మరో ప్రావీణ్యం ఉండాలి అంటూ పంపిస్తారు. అలసిపోయి ఇంటికి వచ్చిన వారి చేత హోంవర్క్ చేయించడం లేదా చదివించడం.. అలా గడిచిపోతుంది. ఇటీవల పిల్లల్లో సృజనాత్మకతను పెంచేందుకు పరీక్షల పద్ధతుల్ని మార్చాక, సొంత ఆలోచనలతో వ్యాసాలను, ఛార్టులను తయారుచేయాల్సిన బాధ్యత కూడా ఎక్కువగా మహిళలపై పడుతోంది. శనిఆదివారాలలో స్విమ్మింగ్, ఏదైనా ఆట ప్రాక్టీస్. అదీకాకపోతే బైట కార్యక్రమం మరోటి. ఇలా పిల్లల ఇష్టాయిష్టాలతో, వాస్తవ పరిస్థితులతో సంబంధం లేకుండా బరువుగా, బలవంతంగా రుద్దే కార్యక్రమాలు ఎక్కువవుతున్నాయి. అందరి పిల్లల్లో జ్ఞాపకశక్తి, తెలివి, ఆసక్తి, శ్రమకు అలవాటుపడే తత్వం ఒకేలా ఉండవు. వారి ఇష్టాన్ని, తట్టుకోగల శక్తి, మేధస్సుని గమనించి తగిన ప్రోత్సాహాన్ని, ఆసరాని ఇవ్వాలి. తల్లికి దూరంగా ఉండలేని పిల్లలను హాస్టల్‌లో ఉంచరాదు. ఇంటర్ వరకూ అయినా ఇంటి దగ్గరే ఉంచాలి. తర్వాత కొంత ధైర్యం వస్తుంది. అంతేతప్ప హాస్టల్‌లో బాగా చదివిస్తారు, భయపెడతారు కనుక బాగా మార్కులు వస్తాయి అనుకోరాదు. తల్లిదండ్రులుగా బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయకూడదు. శ్రద్ధ, ఇష్టం, ఆసక్తి ఉండేలా తల్లి అలవాటు చేయాలి. తగిన ప్రోత్సాహం ఇవ్వాలి. ఆ తర్వాత ఎటూ అలవాటు పడతారు. బయట వాతావరణంలో సర్దుకుపోయే తత్వం పట్టుబడుతుంది. ఎనిమిదీ పదీ ఏళ్ల వయసులో పిల్లల్ని హాస్టల్‌లో ఉంచడం మంచిది కాదు. ఈరోజుల్లో ప్రతీ ఊరికీ ఎంతోకొంత దగ్గరలో పాఠశాలలు, కాలేజీలు ఉంటున్నాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు సరైనవారు ఉండరు అనుకుంటే, ట్యూషన్ ఏర్పాటు చేసి ఇంటి దగ్గరున్నప్పుడు తల్లీతండ్రీ చదువు చెప్పుకుంటే పిల్లలు బాగానే చదువుకోగలరు. పేద, చదువులేని తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి చదువును అందించేలా రాజకీయ వ్యవస్థ మీద ముఖ్యంగా ఓట్ల పండగ సమయంలో గట్టి ఒత్తిడి తేవాలి. ప్రభుత్వం కదిలేంత వరకూ పౌరసమాజం, చుట్టుపక్కల చదువుకున్న ఔత్సాహికులు ఇలాంటి పిల్లలకు చదువులో తోడ్పాటు అందిస్తుండాలి. తల్లిదండ్రులకు చదువు లేని, రిజర్వేషన్ల పరిధిలోకి రాని పేదపిల్లలకు లోక్‌సత్తా సూచిస్తున్నట్టు అదనంగా మార్కులు కలపటం వంటి చర్యలను చేపట్టాలి.



లక్షల రూపాయల ఫీజున్న స్కూళ్లు కాలేజీలు మాత్రమే

'విద్యావకాశాల నెలవు' అనుకోవాల్సిన పనిలేదు. తెలివైన విద్యార్థిని ఎక్కడైనా రాణించగలదు. కొద్దిపాటి ప్రోత్సాహం ఇస్తే చాలు. సాధారణంగా అబ్బాయిల కంటే అమ్మాయిలకు చదువులో అయినా, ఏ పనిలో అయినా శ్రద్ధ ఎక్కువని చెబుతుంటారు. నిజమేనని చాలా సందర్భాలలో చూస్తుంటాం కూడా. ఆధునిక టెక్నాలజీ వాడకంలో కూడా అదుపులో ఉండగలరు అమ్మాయిలు. తమను తాము నియంత్రించుకుని అవసరానికి మాత్రమే ఉపయోగించగల వివేకం వారికి ఉంటుంది. ఏదైనా విషయం చెప్పినప్పుడు అర్థం చేసుకుంటారు. చిన్నప్పటి నుంచే బాధ్యతనెరిగి మసలుకోవటం చాలామంది



అమ్మాయిలలో కనిపిస్తుంది. నా స్నేహితురాలు ఒక ఐఏఎస్ ఆఫీసర్ ఉన్నారు. ఆవిడ తన కుమార్తెకు వత్తిడి.. పోటీ.. ఏదో భారీ ఆశయం ఉండి తీరాలనే పట్టుదలతో కాకుండా స్వేచ్ఛగా తనకి ఇష్టమైన చదువును నేర్చుకోవటానికి అవకాశం ఇచ్చారు. ఆ అమ్మాయి ఆర్ట్స్ గ్రూప్ తీసుకుంది. డిగ్రీ పూర్తి చేసింది. ఇప్పుడు సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్ రాయవచ్చు లేదా ఎంబీయే చదవవచ్చు, లేదా మరో కోర్సు చేయొచ్చు అని తల్లి చెబితే సివిల్ సర్వీస్‌ను ఎంచుకుంది. అందులో కృషి చేస్తోంది. ఆ అమ్మాయి డిగ్రీ వరకు మామూలు ఫోన్ మాత్రమే వాడేది. సొంత స్కూటీ లేదా ప్రజారవాణాను ఉపయోగించేది తప్ప ప్రభుత్వ వాహనం ఏనాడూ వాడలేదు. తల్లి ప్రభుత్వ అధికారిణి అయినంత మాత్రాన కుమార్తె సకల సౌకర్యాలూ అనుభవించే అవకాశం, హక్కూ ఉన్నాయని కాకుండా సామాన్య ప్రజల లాగానే మసలుకోవటం ఆ మహిళా అధికారి పెంపకంలోని విశేషం. అవకాశం కాస్తంత దొరికితే చాలు, దర్జా వెలగబెట్టటం చూస్తుంటాం. అటువంటిది అమ్మాయి పెంపకంలో శ్రద్ధ తీసుకుని డిగ్నిటీ ఆఫ్ లేబర్‌తో తీర్చిదిద్దిన ఆమె సంస్కారాన్ని మెచ్చుకోనివారుండరు.

పిల్లలకు ఆధ్యాత్మికతను నేర్పడంలో అర్థం.. అందులోని మంచిని ఆచరిస్తే మంచి పౌరులుగా తయారవుతుంది యువత అనే సందేశం. కష్టం నుంచి మంచి స్థాయికి ఎదిగిన వ్యక్తులను దృష్టిలో ఉంచుకుని ఎవరికి వారు 'సరైన చదువు'ను పెంచుకోవాలి, ఎప్పటికప్పుడు జ్ఞానాన్ని విస్తరించుకుంటుండాలి. ఆకర్షణలకు లక్ష్యాలను మించిన ప్రాధాన్యత ఇవ్వకూడదు. వినోదం విశ్రాంతి అవసరమేగానీ.. అవి కూడా ఒక క్రమపద్ధతిలో మన ఎదుగుదలకు దోహదం చేసేవిగా ఉండాలి. ప్రతివారికీ కావలసింది లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలి. అది బాధ్యత గల మహిళల పెంపకంలో ఎక్కువ శాతం సాధ్యమవుతుంది. ప్రతి బిడ్డకీ తల్లీతండ్రీ ఆ తర్వాత గురువు దిశానిర్దేశకులవుతారని కొత్తగా చెప్పనక్కర్లేదు.

పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు కొన్ని త్యాగాలు చేయాలి, తప్పదు. అది వారి బాధ్యత. అలా అని దండించడం, భయపెట్టడం కాదు. స్నేహంగా ఆత్మీయంగా భరోసాతో దగ్గరకు తీసుకోవాలి. తల్లిదండ్రులు తమ ఆర్థిక సమస్యలను, ఆశలను వారికి ఏకరువు పెట్టకూడదు. ఆత్మవిశ్వాసం, స్థయిర్యంతో ఎదుర్కోవడం నేర్పించాలి. ఏ చదువు పట్ల పిల్లలకు ఆసక్తి ఉందో తెలుసుకోవాలి. పిల్లలు చిన్నప్పుడు ఆడుకునే వస్తువులను బట్టి ఎందులో ఆసక్తి ఉందో బయటపడుతుంది. తర్వాత తోటి విద్యార్థులు కొందరు వ్యక్తుల ప్రభావం ఉండి అటువైపు ఆలోచిస్తారు. సాధారణంగా ఇంట్లో తల్లిదండ్రుల ప్రభావంతో లేదా క్లాస్ విద్యార్థులు, స్నేహితులు కూర్చుని మాట్లాడుకున్నప్పుడు వారికి ఒక స్థిరత్వం ఏర్పడుతుంది. వీటన్నిటికీ సోషల్ మీడియా, స్మార్ట్ టెక్నాలజీ ప్రభావం తోడవుతుంటే పిల్లల ఆలోచనలు ఎలా ఉంటాయో తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన అవసరముంది. పిల్లల ఆసక్తుల్ని తెలుసుకోవటానికి, విశ్లేషించటానికి అవసరమైతే తెలిసినవారు, నిపుణుల అభిప్రాయాలను సాయంగా తీసుకోవాలి. పిల్లల ఆకాంక్ష సాధ్యమైనదే అయితే ప్రోత్సహించడం, కాకపోతే అందులో సమస్యను కష్టాన్నీ చక్కగా అర్థమయ్యేలా చెప్పి వారించటం చేయాలి. ఒక ఉదాహరణ నాకెంతో విస్మయం కలిగించింది. ఆ తర్వాత గర్వమూ కలిగింది.

ఒక కుటుంబంలో అమ్మాయికి చిత్రలేఖనం పట్ల ఎంతో ఆసక్తి ఉండేది. నేర్చుకుంది స్కూల్లో చదువుతూ. ఆ తర్వాత ఇంటర్‌లో బైపీ గ్రూప్ తీసుకోవాలని అనుకుంది. కానీ తండ్రి ఉపాధ్యాయుడు కావటంతో ఆయన సబ్జెక్ట్ మ్యాథ్స్ అయినందువల్ల ఎంపీసీ గ్రూప్‌లో చదివించారు. ఆయన అభిప్రాయం.. మ్యాథ్స్‌లో మంచి గ్రిప్ ఉంటే ఏ కోర్స్ చదివినా సులువుగా చేయగలదని. మెడిసిన్ చదివిన తర్వాత పీజీలో సీట్లు తక్కువ. డొనేషన్ కట్టే

స్థాయి లేదు అనేది ఆయన ఆలోచన. అందువల్ల ఇష్టం లేకపోయినా అమ్మాయి చదివింది. ఆ తర్వాత ఇంజినీరింగ్ చేసి 15 సంవత్సరాలపాటు అనేక కంపెనీల్లో పనిచేసి సంపాదించిన డబ్బుతో మెడిసిన్ చేసింది. అది మనదేశంలో సాధ్యం కాదు. అమెరికాలో జరిగింది ఇదంతా. అంటే అంతరాంతరాల్లో మనం ఇది సాధించాలి అనే పట్టుదల కోరిక ఉంటే, అవకాశాన్ని వెతుక్కుని మరీ సాధించగలరు. డబ్బు ఎల్లకాలం సమస్యగా మిగిలిపోలేదు. డాక్టర్‌కి, లాయర్‌కి వయసుతో సంబంధం లేదు. వారు చేయగలిగినంత కాలం పనిచేయవచ్చు. ఆ అమ్మాయిని ఎందరో అభినందించారు. అయితే, అదేమంత సులువు కాదు. చాలా కష్టపడాల్సి వచ్చింది. పెళ్లి, పిల్లలు, సంసారం చూసుకుంటూ ఆ అమ్మాయి ఈ విజయం సాధించడం ఎంతటి గొప్ప విశేషమో అని తరచూ అనిపిస్తుంటుంది. ఎలాగోలా డిగ్రీ చదివేసి ఏదోకదాంట్లో చేరిపోయి కాలం గడిపేసేవారు కొందరు. తల్లిదండ్రుల బలవంతం ఇష్టం మీద చదువుకునే వారు ఇంకొందరు. సాధారణంగా ఇలాగే జరుగుతూ వుంటాయి. అలాకాకుండా సొంతంగా ఒక ధ్యేయం ఉంటే, దాని ఫలితం వేరుగా ఉంటుంది.

పదో తరగతి పూర్తి అయిన తర్వాత ఇంకా బాల్యదశలోనే ఉంటారు కొందరు పిల్లలు. వారికి పెద్దలను అనుసరించడమే తెలుసు. కాలక్రమేణా చుట్టుపక్కల ప్రపంచం గురించి తెలిశాక 'నేనింకేదో' చేయాల్సింది అనే మథనం కలగొచ్చు. గతం గురించి మితిమీరిన మథనం సాగించటం కంటే, అవకాశం లభిస్తే ఎప్పుడైనా అనుకున్నది సాధించగలం అని అడుగు ముందుకు వేయాలి. ఓర్పు, నేర్పు, శ్రద్ధ, అవకాశం కలిసి రావాలి. అప్పుడు కలిగే ఆనందమే వేరు. తాము చేయలేనిది స్వయంకృషితో సాధించిన కూతుర్ని చూసుకుని ఇంతకుముందు నేను చెప్పిన విస్మయకర ఉదాహరణలోని తల్లిదండ్రులు ఉప్పొంగిపోయారు. గర్వపడ్డారు. కూతురి ఆత్మవిశ్వాసాన్ని, స్వయంకృషినీ మెచ్చుకున్నారు. అనుకున్న గోల్‌ని చేరుకోవడానికి అవగాహన, పట్టుదల ఉంటే అమ్మాయిలు కాలానికి ఎదురీది కూడా విజయం సాధిస్తారని, వారికి అంతటి ప్రజ్ఞాపాటవాలు ఉన్నాయని రుజువు చేసిందా కూతురు. ఇప్పుడున్న సామాజిక పరిస్థితుల్లో మొదట తల్లిదండ్రులు, ఆ తర్వాత భర్త ప్రోత్సాహం ఉంటే చాలామంది అమ్మాయిలు అబ్బాయిలకు ఏమాత్రం తీసిపోకుండా శిఖరప్రాయమనిపించే విజయాలను చేరుకోగలరు. ఆకర్షణల వెంట పరుగులు తీయకుండా పిల్లలు వివేకం కలిగి సరైన మార్గం ఎంచుకునేలా చేయటంలో తల్లి పాత్ర ఎంతో కీలకమైనది.


ఇప్పటి విద్యావిధానం, తల్లిదండ్రుల ఆకాంక్షలూ సున్నిత మనస్కులైన పిల్లల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అది గమనించక పిల్లల్ని హాస్టల్‌లో ఉంచితే, పరిణామాలు దారుణంగా ఉంటున్నాయి. కొందరు పిల్లలు పైకి చెప్పుకోలేక మథనపడుతుంటే, ఇంకొందరు మార్కులు, ర్యాంకులు వస్తున్నా నిస్తేజంగా తయారవుతుంటారు. ఈ విషయాన్ని తల్లి మాత్రమే గ్రహించే అవకాశం ఎక్కువ కాబట్టి, బిడ్డల మనసు తెలుసుకుని అందుకు తగ్గట్టు ఆమె ధైర్యంగా నిర్ణయాల్ని చెప్పటం అవసరం. ఇప్పుడు లేని అవకాశం మరెప్పుడూ రాదు అనుకోవాల్సిన పనిలేదు. ఇదే డిగ్రీ చదవాలని కూడా హైరానాపడనక్కర్లేదు. ఎవరైనా నచ్చిన అంశంలో కష్టపడి చదువుతూ నైపుణ్యాలను పెంచుకుంటుంటే ఎప్పుడైనా విజయావకాశాలను అందుకోగలరు. పూర్వం రోజుల్లో పెద్ద కుటుంబాలలో అందరినీ చదివించే అవకాశం ఉండేది కాదు. అయినప్పటికీ కొందరు వారికి ఇష్టమైన రంగంలో ప్రతిభను నిరూపించుకోగలిగారు. ఇప్పుడు ఒకరిద్దరు సంతానమే గనక శ్రద్ధ వహించటానికి అవకాశాలు చాలా ఉన్నాయి. అయినా ఒక వృత్తి మీదనే దృష్టి పెడుతున్నారు. ఇది విచారకరం. మనదేశంలో చాలావరకూ ఒకే రంగంలో ప్రవేశించి చివరిదాకా మూసపద్ధతిలో, యాంత్రికంగా అందులోనే కొనసాగుతూ ఉంటారు. పూర్తిగా మరో రంగానికి మారక పోయినా, మరో నైపుణ్యాన్ని పెంచుకుని ఇతర రంగాలనూ ప్రభావితం చేయగల శక్తిని పెంచుకోవటం అవసరం. ఎప్పుడూ చక్కటి ప్రణాళికలను అమలు చేయగలిగినవారు రాణిస్తూనే ఉంటారు. కొన్ని కుటుంబాలు వారసత్వంగా వ్యాపారరంగంలో ఉంటారు. తల్లిదండ్రులు, కుమారులు ఇలా. ఎందుకంటే అందిపుచ్చుకున్నట్టుండే వ్యవహారం కనక. మరికొందరికి ఇలాంటివి నచ్చవు. సొంత ఆలోచన నైపుణ్యంతో ఎదగాలని భావిస్తారు. అన్నీ మంచివే! మనిషి ఎదుగుదల ప్రావీణ్యత ఒక్క దశతో ఆగిపోదు. కలకాలం కొనసాగించవచ్చు. అందుకు తగిన వ్యూహం అవసరం. ఈ క్రమంలో బిడ్డల ఆలోచనలను పంచుకోగల మాతృమూర్తి మొదటి గురువు అవుతుంది. ప్రతీ మహిళా ఈ బాధ్యతను సక్రమంగా నెరవేర్చే సహకారాన్ని పురుషులు ఎంత అందిస్తే సమాజం అంత ఎదుగుతుంది.

కాబట్టి పిల్లలను తీర్చిదిద్దుకోవడంలో మహిళల పాత్ర ఉదాత్తమైనది. వివక్షను అధిగమిస్తూ, వ్యవస్థను మార్చటంలో తన వంతు పాత్రను సక్రమంగా నెరవేర్చుకోగలిగితే జీవితమంతా సంతోషమే. ఇప్పటి మహిళలు సెంటిమెంట్స్‌తో కుంగిపోకుండా సరైన నిర్ణయాలు తీసుకుంటూ సహనంతో పిల్లల భవిష్యత్తుకి బంగారు బాట వేస్తే, సొంతసుఖాన్ని-సమాజహితాన్ని అనుసంధానం చేసుకోగల నిజమైన పౌరులతో ఈదేశం సుసంపన్నమవుతుంది. ★

# వివేకానంద లక్ష్యాల్ని అందుకునే ఆలోచనల్ని, విధానాల్ని యువతకు అందిస్తున్నామా?

- కూసంపూడి శ్రీనివాస్

"మిమ్మల్ని బలవంతుల్ని చేసే ప్రతీ ఆశయాన్నీ స్వీకరించండి, బలహీనపరిచే ప్రతీ ఆలోచననూ తిరస్కరించండి" అని దేశంలోని యువతకు పిలుపునిచ్చిన స్వామి వివేకానంద పుట్టిన రోజైన జనవరి 12ని జాతీయ యువజన దినోత్సవంగా 1984లో భారత ప్రభుత్వం ప్రకటించింది. మరి దేశ సౌభాగ్యానికి తలమానికమైన యువత నేడు ఆ దిశగా పయనిస్తుందో లేదో అందరూ ఆలోచించాలి. ఎక్కడ చూసినా హత్యలు, ఆత్మహత్యలు, మానభంగాలు, అపహరణలు, అల్లరి చేయడాలు సాధారణమైపోయాయి. ఈ విషయంలో ఒక్క బాలురదే తప్పనిగానీ, లేక బాలికలదే తప్పనిగానీ ఏకపక్షంగా నిర్ణయించడం సమంజసం కాదు. సమస్యని రెండు వైపుల నుండీ ఆలోచించాలి. పిల్లల పెంపకంలో మొట్టమొదటి బాధ్యత తల్లిదండ్రులదే. రెండవది పాఠశాలలో ఉపాధ్యాయులది. స్వార్థమే పరమావధిగా, సమాజంలో డబ్బే ప్రధానంగా, విలాసాలలో మునిగితేలడమే సుఖప్రదంగా భావించుకోవడం, పక్కవారి బాగోగులతో పనిలేదనుకోవడం, కొత్తగా వచ్చే ప్రతి సంప్రదాయాన్నీ నవనీతగా భావించి, పాత సంప్రదాయాలను, అలవాట్లను మొరటుతనమని భావించి, అనైతిక అలవాట్లకు బానిసలై, గతంలో ఉన్న మంచిని పూర్తిగా విస్మరించినదాని ఫలితమే ఇది.




అయితే యావత్ భారతదేశంలోని యువత అంతా అదే నిరాశనిస్పృహలో ఉన్నదంటే అది నిజం కాదు. క్రమంగా నేటి యువతరంలో రాజకీయాల పట్ల, సమాజ స్థితిగతుల పట్ల ఆసక్తి పెరుగుతోంది. ఈ శతాబ్దపు ఆరంభంలో రాజకీయాలంటే వ్యతిరేకత, రాజకీయ నేతల పట్ల ద్వేషం, ఓటింగ్‌కి దూరంగా ఉండే మనస్తత్వం నుంచి నేటి యువత బయటపడుతోంది. ఆనాడు విద్యార్థులకు రాజకీయాలద్దన్న రాజకీయ నేతలు, మేధావులు నేడు యువతకు ఆహ్వానం పలుకుతున్నారు. రాజకీయాలను శుద్ధి చేయాలంటే యువత ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు. ఈ మార్పునకు ప్రధాన కారణం యువతరంలో పెరుగుతున్న అసంతృప్తి. దాన్నుంచి పెల్లుబుకుతున్న అశాంతి. అది వ్యవస్థపై దాడి చేయడానికి ముందే వారిని వ్యవస్థలో ఇముడ్చుకోవడానికి చేస్తోన్న

ప్రయత్నమే ఇది. ఈ తరానికి నాయకత్వం వహించడానికి అధికార పార్టీల నాయకులు తిరిగి తమ బిడ్డల్నే యువనాయకులుగా తెరమీదకు తెస్తున్నారు. యువతను ఆకర్షించడానికి ప్రతీ పార్టీ పోటీపడుతోంది. మొత్తం మనదేశంలోని ఓటర్లలో సగం 40 ఏళ్ల లోపువారే. వీరి కలల్ని తమ పదవులకు సోపానాలుగా వాడుకోవాలని నేటి రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

నిజానికి ఈనాడు ఈ భూమండలంపై అత్యధిక యువశక్తి కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 10 నుంచి 24 సంవత్సరాల మధ్య వయసున్నవారు మనదేశంలోనే ఎక్కువగా ఉన్నారని ఐరాస తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ వయసువారు భారత్‌లో ఏకంగా 35.6 కోట్లమంది ఉన్నారని వెల్లడైంది. జనాభాపరంగా భారత్ చైనా తరువాతి స్థానంలో ఉన్నా.. యువజనం విషయానికొచ్చేసరికి మనమే ముందుండటం విశేషం. 2010 నుంచి భారత ఆర్థిక వ్యవస్థ మందగమనంలో పడింది. నూతన అవకాశాలు కల్పించిన సర్వీస్ సెక్టార్ విస్తరణ ఆగిపోయింది. పారిశ్రామికాభివృద్ధి రేటు పడిపోయింది. వ్యవసాయం కుంటుబడింది. పనులు వెతుక్కుంటూ పట్టణాలకు వెళ్లినవారు తిరుగుముఖం పడుతున్నారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కాలేజీలు పుట్టగొడుగుల్లా పెద్దసంఖ్యలో విస్తరించడంతో ప్రతీ సంవత్సరం లక్షలాది మంది యువకులు బయటకు వస్తున్నారు.

దానితోపాటు దేశంలో యాభై లక్షలమందికి పైగా పట్టభద్రులు తయారవుతున్నా వారిలో ఉద్యోగాలు పొందడానికి కావలసిన అర్హతలు ఉన్నవారు చాలా కొద్దిమందే. భారత్‌లోని పట్టభద్రుల్లో 58శాతానికి కనీస ఉద్యోగార్హతలు లేవు. దేశంలోని 1200 ఉపాధి కల్పనా కేంద్రాల్లో నాలుగు కోట్ల మంది తమ పేర్లను నమోదు చేసుకోగా, కేవలం మూడు లక్షల మందికే ఉద్యోగాలు లభించాయి. యువత నైపుణ్యాభివృద్ధిలో అమెరికా, జపాన్, కొరియాల కన్నా భారత్ ఎంతో వెనబడింది.

ఇదీ నేటి మనదేశంలోని యువత పరిస్థితి. దీన్ని ఆసరాగా చేసుకున్న కార్పొరేట్ వర్గాలు తక్కువ జీతాలకు ఉద్యోగాలకు పిలుస్తున్నారు. ఉద్యోగాలున్న వారికి జీతాలు పెంచటం లేదు. ఈ స్థితిలో ఐటీ ఉద్యోగాల్లో ఉన్నవారు సైతం నిరాశనిస్పృహలకు లోనవుతున్నారు. ఉద్యోగ భద్రతపై ఆందోళన పెరుగుతోంది. పని ఒత్తిడి పెరుగుతోంది. వెనకబడితే తొలగిస్తారేమోనన్న భయం వెంటాడుతోంది. ఈ స్థితిలో మానసిక జబ్బులు కూడా పెరుగుతున్నాయి. కొంతమంది ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు.

ఆర్థికవ్యవస్థలో వచ్చిన ఈ మార్పు యువతను ఊహించని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ప్రైవేటు రంగంపై అయోమయం ఏర్పడుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పెరుగుతోంది. అప్పటివరకూ వ్యవస్థ, విధానాలు, రాజకీయాల గురించి ఆలోచించని యువతరం ఇప్పుడు వాటిపై దృష్టి సారిస్తోంది. అవినీతి, కుంభకోణాలు, పెరుగుతున్న ధరలు, ఉపాధి తగ్గిపోవటం యువతరాన్ని ఆలోచనల్లో పడేశాయి. ఏమిటి దీనికి ప్రత్యామ్నాయమని ఆలోచించసాగారు. యువతరంలో వస్తోన్న ఈ అనంతృప్తిని నేటి రాజకీయ పార్టీలు ఉపయోగించుకుంటున్నాయి. సుపరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనం లాంటి ప్రత్యామ్నాయ పదజాలాలతో ఆకర్షిస్తున్నాయి. దీనికి నేటి యువత కూడా తగువిధంగా స్పందిస్తుంది అనడంలో సందేహం లేదు.

అయితే యువత ఎక్కువగా ఉన్నంత మాత్రాన అభివృద్ధి వచ్చిపడుతుంది అంటే కరెక్టు కాదు. భారీగా యువజనాభాను కలిగిన వర్ధమాన దేశాలు ఆర్థిక వృద్ధిని పెంపొందించుకోవచ్చని ఐరాస నివేదికలో పేర్కొంది. ఆ ప్రయోజనాన్ని పొందాలంటే యువత వద్ద నైపుణ్యాలు, ఆరోగ్యం, నిర్ణయాధికారం ఉండాలి. అందుకు యువజనుల విద్య, ఆరోగ్యంపై భారీగా పెట్టుబడులు పెట్టి, వారి హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతేకాకుండా మానవ వనరులపై ఎక్కువగా పెట్టుబడులు పెట్టటం, సరైన విధానాల ద్వారా యువతకు సాధికారత కల్పించటం చేయాలి. దీనివల్ల ఆర్థిక, సామాజిక వృద్ధి, తలసరి ఆదాయాల్లో పెరుగుదల కనిపిస్తాయి.

ఉద్యోగాలు, ఇతర ఆదాయ ఆర్జన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన సాధన సంపత్తి కలిగినవారిగా యువజనాన్ని తీర్చిదిద్దాలి. లింగవివక్షను రూపుమాపడంతోపాటు జాతి వివక్షను పారదోలేందుకు చర్యలు చేపట్టాలి. బాల్య వివాహాలను, కౌమార దశలో గర్భం దాల్చే సంఘటనలను నిరోధించేందుకు చర్యలు చేపట్టాలి. ఇలా ప్రత్యేక చర్యలు చేపట్టి యువతలో చైతన్యం నింపిననాడే వివేకానందుని లక్ష్యాలను నెరవేర్చగలం.

(కర్టెసీ: ఆంధ్రప్రభ దినపత్రిక) ★


# ఆనాడే లోక్‌సత్తాకు 15శాతం ఓట్లు, 10శాతం సీట్లు వచ్చి ఉంటే రాష్ట్ర చరిత్రే మారేది

## - ఓపెన్‌హార్ట్ విత్ ఆర్కేలో జేపీ -

- లోక్‌పాల్‌తోపాటే లోకాయుక్తా బలపడాలి
- వ్యక్తుల కోసం వ్యవస్థలను నాశనం చేయవద్దు
- ప్రజలను గొర్రెల్లా కాదు.. మనుషుల్లా చూడండి
- అమ్మాయిలతో మాట్లాడమంటే భయం అనిపించే పల్లెటూరి వాతావరణం నుంచి వచ్చా
- ఎన్టీఆర్ పదవీచ్యుతి సంఘటనతో బాధపడ్డా

: జయప్రకాష్ నారాయణ్

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వ్యవస్థాపకుడు వేమూరి రాధాకృష్ణ ఆ ఛానల్‌లో చేసిన 'ఓపెన్‌హార్ట్ విత్ ఆర్కే' ఇంటర్వ్యూలను ఎమెస్కో సంస్థ ఇటీవల పుస్తకరూపంలో వెలువరించింది. అందులో లోక్‌సత్తా వ్యస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌తో 2011, జూన్ 26న ఆర్కే చేసిన ఇంటర్వ్యూ :




**ఆర్కే: లోక్‌సత్తా పార్టీ పెట్టాక ఆశనిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారా?**

జేపీ: మొదట్లో చాలా ఉద్వేగంగా ఉండేది. మనదేశంలో రాజకీయ సంస్థ పెట్టి నడపటం అంత సులభం కాదు. కానీ తప్పదు. రాజకీయం తీరు మార్చి, దీనకో కొత్త అర్థాన్నివ్వాలి. మంచివారికి, నిజాయతీపరులకు అవకాశం ఇవ్వాలనుకున్న తర్వాత గత్యంతరం లేదనుకుని బాధతోనే ఆ నిర్ణయం తీసుకున్నా. మధ్యతరగతి వాళ్లు ఇంట్లో కూర్చుని రాజకీయాలను తిట్టుకోవటం మానాలి. ఓట్లు వేయడం, రాజకీయాల గురించి పట్టించుకోవడం, త్యాగాలకు సిద్ధపడటం.. ఇవన్నీ చేయాలి.

**ఆర్కే: మీకు, మీ పార్టీకి నిజాయతీపరులన్న ముద్ర బాగా ఉంది. చిరంజీవికి విపరీతమైన కరిష్మా ఉంది. అయినా ఇద్దరినీ ఓటర్లు కాదనడానికి కారణం ఏమిటి?**

జేపీ: మన ఎన్నికల వ్యవస్థే. ఇదే ఫ్రాన్సు/జర్మనీ అయితే ఇది సరిపోయేది. మనకేసిన ఓట్ల వల్ల సీట్లు వస్తాయనుకుంటే కచ్చితంగా ఓట్లు వేయడానికి చాలామంది వచ్చేవారు. వ్యవస్థ బాగుంటే మూడో పార్టీ అవసరమే రాకూడదు. ఎన్టీఆర్ వచ్చినప్పుడు కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయం లేదు కాబట్టి ఆయన గెలిచారు. నాది వైఫల్యంగా భావించట్లేదు. నేను చాలా ఆశావాదిని. కనీసం పదివేల మంది సమర్థులైనా సమాజంలో మార్పు కోసం ముందుకొస్తారని ఆశించా.. అదే జరగలేదు.

**ఆర్కే: సమాజాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమేనా?**

జేపీ: మన సమాజంలో అన్ని రంగులూ ఉంటాయి. కులతత్వం, ఉదాత్తభావం.. అన్నీ ఉంటాయి. కానీ సమయం వచ్చినప్పుడు కచ్చితంగా మారుతుంది. ఎవరికివాళ్లు తమ ముందు తరం చాలా బాగుందని, ఇప్పుడు కుళ్లిపోయిందని భావిస్తారు. కానీ ఇది పూర్తిగా అవాస్తవం. ప్రజలెప్పుడూ ఒకేలా ఉంటారు. కొందరు నిజాయతీపరులు, మరికొందరు దోపిడీదారులు ఉంటారు.

**ఆర్కే: లోక్‌పాల్ ముసాయిదాను మీరే రూపొందించారా?**

జేపీ: అత్యధిక భాగం నాదే. కానీ, దాంట్లో రాష్ట్రాల గురించిన ప్రస్తావన లేదు. వీళ్లంతా ఢిల్లీ స్థాయి గురించే మాట్లాడుతున్నారు. లోక్‌పాల్‌లాగే లోకాయుక్తను కూడా రాష్ట్రస్థాయిలో బలోపేతం చేయకపోతే.. కొండను తవ్వి ఎలకను పట్టినట్లే. ప్రధానిని, సుప్రీంకోర్టుని కూడా దీని పరిధిలోకి తేవాలనడం పొరపాటే. సుప్రీంకోర్టులోనూ కొందరు అవినీతిపరులున్న విషయాన్ని నేను పేర్లతో సహా సీజేకి చెప్పాను. కొందరు వ్యక్తుల కారణంగా.. వ్యవస్థను నాశనం చేసే పరిస్థితి రాకూడదు.

**ఆర్కే: రాజకీయ వ్యవస్థ, సమాజం మారకుండా కేవలం లోక్‌పాల్ లాంటి వాటి వల్ల ఏమైనా బాగుపడుతుందా?**

జేపీ: లోక్‌పాల్ వల్లే జరుగుతుంది అనుకోనక్కర్లేదు.. అలాగని ఇది పనికిరాని వ్యవస్థా కాదు. వ్యవస్థను బాగుచేయటంలో అందరి పాత్రా ఉండాలి.

**ఆర్కే: రాజకీయాల్లోకి వచ్చాక బాధకు గురయ్యారు కదా?**

జేపీ: నేను అప్పుడూఇప్పుడూ ఏనాడూ అనుకోలేదు. శాసనసభలో ఆ సంఘటన జరిగినప్పుడు మీరంతా చూశారు. అది దురదృష్టకరం అనుకున్నానంతే. ప్రభుత్వంలో ఉన్నప్పుడు కూడా దాడులకు గురయ్యా. ఓసారి నా కారు ధ్వంసం చేశారు. కానీ కంటికి కన్నే బదులైతే లోకమంతా గుడ్డిదే అవుతుంది.

**ఆర్కే: రాజకీయాల్లో మీకు కులతత్వం ఆపాదించారు, కాంగ్రెస్‌కి అనుకూలంగా ఉంటారని అంటగట్టారు.**

జేపీ: నేను కాంగ్రెస్‌కి, బీజేపీకి, టీడీపీకి.. అందరికీ అనుకూలమే. కానిదెవరికి? సంకుచితత్వంతో ఆలోచించేవాళ్లకే అలా అనిపిస్తుంది. ఎన్నికల తర్వాత చంద్రబాబు నాపై ధ్వజమెత్తారు. మా 2శాతం ఓట్ల వల్లే ఓడామన్నారు. అలాగైతే కులతత్వం ఉందని ఎలా అంటారు..

**ఆర్కే: చంద్రబాబు మీ పార్టీని విలీనం చేద్దామని ప్రతిపాదించలేదా?**

జేపీ: లోక్‌సత్తా అనగానే అలాంటి మాటలు ఎవరూ అనలేరు. రాజకీయాలంటే నాయకులు చాలా జాగ్రత్తగా ఆలోచిస్తారు. అది ఎవరైనా అంతే. కొంత హుందాతనం.. ఇలాంటివన్నీ వస్తాయి. నాకు ఎవరి మీదా ద్వేషం లేదు.. ప్రేమా లేదు. చిరంజీవి చాలామంది చేయలేని పనిచేశారు. వ్యవస్థని బాగు చేయటానికి ఒక ప్రయత్నం చేశారు. విఫలం అయ్యారని కూడా అనక్కర్లేదు. అసలు సీఎం అయ్యాక ఏం చేయాలో కూడా తెలియకుండానే సీఎం అయిపోవాలనుకోవడం తప్పు. పార్టీ నడపటం ఎంత కష్టమో నాకు తెలుసు. మా పార్టీకి వచ్చే ప్రతి పైసా చెక్కు రూపంలోనే వస్తుంది. జనాన్ని డబ్బు పెట్టి తీసుకురావడం, ఆర్భాటంగా సభలు పెట్టడం ఇదంతా వెర్రి. ప్రజలను మనుషుల్లా చూడాలి.. గొర్రెల్లా కాదు.

**ఆర్కే: గతంలో వచ్చినన్ని ఓట్లు ఈసారి వస్తాయంటారా?**

జేపీ: అంతకు పదిరెట్లు రావడం ఖాయం. ప్రజలు ఎల్లకాలం మోసపోరు. ఆనాడే లోక్‌సత్తాకు 15శాతం ఓట్లు, 10శాతం సీట్లు వచ్చి ఉంటే ఈ రాష్ట్ర చరిత్ర మారేది.

**ఆర్కే: తెలంగాణ సమస్య పరిష్కారం అవుతుందా?**

జేపీ: ఢిల్లీ వాళ్లకు ఏమాత్రం విజ్ఞత ఉన్నా అయి తీరాల్సిందే. ఏదో ఒక స్థిర నిర్ణయం త్వరగా చేయాలి. రాష్ట్రం ఇప్పటికే నష్టపోయింది.

**ఆర్కే: రాజకీయాల్లోకి వచ్చాక పదేపదే కన్నీళ్లు పెట్టుకున్నారు. అందుకు కారణం ఏమిటి?**

జేపీ: చిన్నప్పటి నుంచి రాజ్యాంగాన్నే నేను ప్రాణంగా ప్రేమించాను. మరి నేనున్న సభలో ఒక చట్టం తీసుకురావడానికి

వీల్లేదని నేను అన్నప్పుడు.. మేం పట్టించుకోం అని వాళ్లంటే ఆ క్షణం బాధ తన్నుకొచ్చిన మాట వాస్తవం.

**ఆర్కే: జగన్ పార్టీ భవిష్యత్తు ఎలా ఉంటుందని మీ అంచనా?**

జేపీ: మనం జ్యోతిషం చెప్పలేం. కానీ స్థానికంగా తాత్కాలికంగా ఉండే బలం వేరు.. దీర్ఘకాలంగా విస్తృతంగా ఉండేది వేరు. ఓ కుటుంబం ప్రభావం ఆ జిల్లాలో బాగా ఉండి, అధికార.. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పులు తోడైనప్పుడు విజయాలు సాధ్యమే. నిజానికి జగన్‌కు అతిపెద్ద మిత్రులు చంద్రబాబు, సోనియాలే. ప్రతిరోజూ ఆయన గురించి చెబుతూనే ఉన్నారు.

**ఆర్కే: మీకు బాగా సంతృప్తి కలిగించిన ఘటన ఏంటి?**

జేపీ: ప్రకాశం జిల్లాలో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం

**ఆర్కే: అసలు మీరు ఐఏఎస్ సర్వీసుకు ఎందుకు రాజీనామా చేయాలనుకున్నారు?**

జేపీ: ఎందుకు చేరానో అందుకే మానేశాను. ఉద్యోగం, జీతాల కోసం నేను చేరలేదు. ఎమర్జెన్సీ తర్వాత జనతాపార్టీతో చాలా జరుగుతుందనుకుంటే ఏమీ జరగలేదు. దాంతో ఫ్రస్ట్రేషన్ వచ్చింది. అప్పుడే మెడిసిన్ పూర్తవుతోంది. అప్పట్లో మీరా అనే నా స్నేహితురాలు ఐఏఎస్ చేరొచ్చు కదా! అంది. అలా కాకతాళీయంగా చేశాను. ఎప్పుడూ అందరికీ అందుబాటులో ఉండేవాడిని. చేరిన రెండేళ్లకే అందులోని లోపాలు అర్థమయ్యాయి. నిజామాబాద్‌లో నా మిత్రుడు అప్పారావు అని ఉండేవారు. మహారాష్ట్ర నుంచి ఆప్తమిత్రుడు రమణి. మేం ముగ్గురం కలిసి నిజామాబాద్‌లో అప్పుడే అనుకున్నాం. చాలామంది నన్ను వెళ్లద్దని చెప్పారే తప్ప పొమ్మన్నవాళ్లు ఎవరూ లేరు. ఏదో ప్రత్యేక సంఘటన వల్ల మాత్రం కాదు.

**ఆర్కే: వైద్య విద్య చదివేటప్పుడు ఎవరినైనా ప్రేమించారా?**

జేపీ: మేమంతా పిరికివాళ్లం. గ్రామాల నుంచి వచ్చినవాళ్లం. ఆడపిల్లలతో మాట్లాడాలంటేనే భయం. కానీ మెడిసిన్‌లో ఐదారేళ్లు చదువుతాం కాబట్టి కొందరు అమ్మాయిలతో మంచి స్నేహం ఏర్పడింది.

**ఆర్కే: మీరు ఎదుర్కొన్న చేదు అనుభవం?**

జేపీ: 1995లో ఎన్టీ రామారావు పదవి పోవడం నేను దగ్గర్నుంచి చూసిన ఘోర సంఘటన. ప్రజలిచ్చిన తీర్పుతో సంబంధం లేకుండా రాజకీయ బలాల ఆధారంగా చేయడం బాధ కలిగించింది. ★

# ఆయిల్ పామ్ ధరలపై ఫార్ములా ఖరారు

ఆయిల్ పామ్ రైతులకు చెల్లించే ధరలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయాన్ని ఖరారు చేసింది. 2015 నవంబర్ నుంచి 2016 సెప్టెంబర్ వరకూ ఫార్ములాను రూపొందించి ఉత్తర్వులు ఇచ్చింది. 1993 ఏపీ ఆయిల్ పామ్ ఉత్పత్తి, నియంత్రణ, ప్రాసెసింగ్ చట్టాన్ని అనుసరించి ఈ నిర్ణయం తీసుకుంది. ఆయిల్ పామ్ రైతుల సంక్షేమ సంఘం, ఆయిల్ పామ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో వ్యవసాయ మంత్రిత్వ శాఖ చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకుంది. ఆ ప్రాతిపదికలతో ధరల్ని చెల్లించే ఫార్ములాను రూపొందించారు. ఈ సూత్రం ప్రకారం, 13.02 శాతం క్రూడ్ పామాయిల్ నిష్పత్తిగా నిర్ణయించారు. పామాయిల్ తాజా గెలల నుంచి ఈమేరకు క్రూడ్ ఆయిల్ లభిస్తుంది.

గతంలో వచ్చిన నిష్పత్తులను పరిగణలోకి తీసుకుని ఓఈఆర్ (ఆయిల్ వచ్చే నిష్పత్తి)ని 17.31 శాతంగా ఖరారు చేశారు. పామాయిల్ గింజలపై 9.76శాతం రికవరీగా పేర్కొన్నారు. ఈ సూత్రం ప్రకారం లెక్కించిన తర్వాత మార్కెట్‌లో అదనపు మార్కెట్ ధరని బట్టి రైతులకు 75.25శాతం, ప్రాసెసర్లు, మిల్లర్లకు 24.75శాతం లభిస్తుంది. వ్యవసాయ మార్పులను, ఇతరత్రా నష్టాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని రైతు సంఘాలు కోరాయి. దీంతో ప్రభుత్వం 2శాతం వరకు ప్రోత్సాహకాన్ని ఇచ్చేందుకు అంగీకరించిందని ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం నాయకుడు రామకృష్ణ చెప్పారు. అయితే ఆ విషయాన్ని తాజా ఉత్తర్వుల్లో పేర్కొనలేదన్నారు. ★

# సమాచార స్వేచ్ఛ ఏమయ్యేట్టు?

- భరత్ ఝున్‌ఝున్‌వాలా

సమాచార విప్లవాన్ని సాధించిన సాంకేతికతలతోనే సమాచార స్వేచ్ఛకు పరిమితులు విధించడానికి ప్రయత్నించడం సబబేనా? రిలయన్స్ కమ్యూనికేషన్స్‌తో కలిసి ప్రజలకు ఉచిత ఇంటర్నెట్ సేవలను అందించేందుకుగాను ఐటీ దిగ్గజం ఫేస్‌బుక్ ఒక ప్రతిపాదన చేసింది. 'ఫ్రీ బేసిక్స్' అనే ఈ వినూత్న పథకం ప్రకారం నెట్ వినియోగదారులకు పరిమిత సంఖ్యలో వెబ్‌సైట్‌లను అందుబాటులో ఉంచుతారు. ఈ ప్రతిపాదనలోని సానుకూల విశేషం ఏమిటంటే ఇంటర్నెట్ సేవలు ఉచితంగా అందుతాయి. ఈ ఉచిత సేవలకు గాను నెట్ న్యూట్రాలిటీ (అన్ని వెబ్‌సైట్లనూ ఎలాంటి తేడాలు లేకుండా ఒకేలా చూడగలగడం) పరిత్యజించవలసి ఉంటుంది.




ఎయిర్‌టెల్, రిలయన్స్ మొదలైన సర్వీస్ ప్రొవైడర్లు ప్రస్తుతం నెట్‌కు యాక్సెస్ మాత్రమే సమకూరుస్తున్నారు. నెట్ వినియోగదారులు ఏ వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేసుకోవాలో ఈ సర్వీస్ ప్రొవైడర్లు నిర్ణయించరు. ఫేస్‌బుక్ ప్రతిపాదన ప్రకారం ఏ వెబ్‌సైట్లను ఉచితంగా యాక్సెస్ చేయాలో, ఏ వెబ్‌సైట్లకు ఛార్జీలు వసూలు చేసుకోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ సర్వీస్ ప్రొవైడర్లకు లభిస్తుంది.

అంటే ఏ కంటెంట్ నెట్ వినియోగదారులకు అందుబాటులో ఉండాలో సర్వీస్ ప్రొవైడర్ నిర్ణయిస్తాడు. ఇంటర్నెట్ సేవలు ఉచితంగా ఇచ్చే ఏర్పాటు ఫేస్‌బుక్ ప్రతిపాదనలోని సానుకూల అంశం కాగా, వెబ్‌సైట్లను యాక్సెస్ చేయడంలో జోక్యం పూర్తిగా ప్రతికూలమైనది. నెట్ వినియోగదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేది.

ప్రస్తుతం నెట్ వినియోగదారునికి ప్రతి వెబ్‌సైట్ అందుబాటులో ఉంటోంది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ పరిమిత సంఖ్యలో మాత్రమే వెబ్‌సైట్లను యాక్సెస్ చేస్తుంది. వాటికి అదనంగా వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేయాలంటే అందుకు నిర్ణయించిన ఛార్జీలను వినియోగదారులు చెల్లించక తప్పదు. అంటే నెట్ వినియోగదారులు ఏ వెబ్‌సైట్లను చూడాలి, వేటిని చూడకూడదు అనే విషయంలో సర్వీస్ ప్రొవైడర్ రిలయన్స్ మార్గ నిర్దేశం చేస్తుందన్న మాట! ఇది, వార్తాపత్రికల విక్రేత తన కస్టమర్ ఏ పత్రికను చదవాలో నిర్ణయించడంలా ఉంది కదూ. రిలయన్స్ ఆకాంక్షిస్తున్నట్టు నెట్ సేవలు అందడమంటే ప్రజల ఆలోచనలను ఒక నిర్దిష్ట దిశలో నియంత్రించడమే. సర్వీస్ ప్రొవైడర్లు కొన్ని వెబ్‌సైట్లను ఉద్దేశపూర్వకంగా స్లోడౌన్ చేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇది, నెట్ వినియోగదారులను నిర్దిష్ట వెబ్‌సైట్లను మాత్రమే వినియోగించుకునేలా ప్రోత్సహించడమే అవుతుంది. దీనివల్ల సర్వీస్ ప్రొవైడర్లకు క్రమేణా, ప్రభుత్వాన్ని విమర్శించే వెబ్‌సైట్లకు అవరోధం కల్పించే వీలు లభిస్తుంది. నేటి ప్రపంచంలో సమాచారమే శక్తి. సమాచార స్వేచ్ఛకు ఇప్పుడు ముప్పు వాటిల్లనున్నది.

ఇంటర్నెట్ సేవలను ప్రజానీకంలో అత్యధికులకు అందుబాటులో ఉంచడం ఎంతైనా అభిలషణీయం. వెబ్‌సైట్ల యాక్సెస్ విషయంలో సర్వీస్ ప్రొవైడర్ జోక్యాన్ని అనుమతించకుండా ఇంటర్నెట్ సేవలు ఉచితంగా అందేలా చేసేందుకు ఒక మార్గాన్ని మనం కనుగొనవలసి ఉంది. పురోగామి ధర నిర్ణయమే (ప్రోగ్రెసివ్ ప్రైసింగ్) ఇందుకు సరైన మార్గం. మునిసిపాలిటీలు వీధి చివర కుళాయిల ద్వారా తాగునీటిని ఉచితంగా సరఫరా చేస్తాయి. అయితే పైపుల ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తే నీటికి ఛార్జీలు వసూలు చేస్తాయి. అయితే వీధి కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగునీరు, నేరుగా




గృహాలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యత మధ్య ఎటువంటి తేడా ఉండదు. అలాగే విద్యుత్తును తక్కువగా వినియోగించుకునే వారి నుంచి స్వల్ప ఛార్జీలను మాత్రమే వసూలు చేస్తాయి. వినియోగం పెరుగుతున్నకొద్దీ విద్యుత్తు ఛార్జీలు పెరుగుతాయి.

ఉత్తరాఖండ్‌లో వినియోగం స్థాయిని బట్టి యూనిట్‌కు రెండు నుంచి నాలుగు రూపాయల దాకా విద్యుత్తు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. అందరికీ ఒకే విధమైన నాణ్యత గల విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. అయితే ఎయిర్‌టెల్ లాంటి సర్వీస్ ప్రొవైడర్లు ఇందుకు పూర్తి విరుద్ధ విధానాన్ని అనుసరిస్తున్నారు. తిరోగామి ధరల విధానాన్ని అనుసరిస్తున్నారు. తక్కువ వినియోగానికి ఎక్కువ ఛార్జీ, ఎక్కువ వినియోగానికి తక్కువ ఛార్జీ వసూలు చేస్తున్నారు. పేదలకు ఉచిత ఇంటర్నెట్ సేవలను అందించాలని రిలయన్స్ కమ్యూనికేషన్స్ సంకల్పించడం హర్షదాయకమే. అయితే నెలకు 1 ఎంబీ డేటా చొప్పున ఉచితంగా అందించి, ఆ పై వినియోగానికి ఛార్జీలు వసూలు చేయడం సముచితంగా ఉంటుంది. ఇలా చేస్తే పేదలకు ఇంటర్నెట్ సేవలు ఉచితంగా అందించాలన్న సంకల్పం సమున్నతంగా నెరవేరుతుంది.

ఇంటర్నెట్ సేవలను ఇలా ఉచితంగా అందిస్తే నెట్ న్యూట్రాలిటీకి కూడా ఎలాంటి విఘాతం కలగదు. అయితే రిలయన్స్ అందించే ఉచిత సేవలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. వెబ్‌సైట్లను యాక్సెస్ చేయడంలో ఆ సంస్థ జోక్యం చేసుకుంటోంది. ఇలాంటి ఉచిత ఇంటర్నెట్ సేవల వల్ల సమాజానికి జరుగుతున్న మేలు తక్కువ. సమాచార స్వేచ్ఛను కోల్పోవడం వల్ల సమాజానికి చాలా పెద్ద హాని వాటిల్లుతోంది. ఇంటర్నెట్ సేవలను క్రమబద్ధీకరించే బాధ్యత టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్)ది. వెబ్‌సైట్లను యాక్సెస్ చేయడంలో సర్వీస్ ప్రొవైడర్లు జోక్యం చేసుకోవడాన్ని నిరోధించేలా నిబంధనలు రూపొందించాలి. ప్రజలకు ఉచిత సేవలు సముచితంగా అందించిన సర్వీస్ ప్రొవైడర్లపై 'యాక్సెస్ డెఫిసెట్ ఛార్జెస్'ను విధించాలి. గ్రామీణ ప్రాంతాలకు సేవలు అందించిన టెలిఫోన్ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి ఇటువంటి ఛార్జీలను వసూలు చేసి ఆ రాబడిని బీఎస్ఎన్ఎల్‌కు చెల్లించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు సేవలు అందించేందుకు ట్రాయ్ దోహదం చేస్తుంది. ఇంటర్నెట్ సేవలు విస్తృత ప్రజానీకానికి అందుబాటులోకి వచ్చేంతవరకు ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి ఇటువంటి ఛార్జీలను వసూలు చేయాలి. ఇలా చేయడం వల్ల వెబ్‌సైట్ల యాక్సెస్ విషయంలో రాజీ పడకుండా ప్రజలందరికీ ఇంటర్నెట్ సేవలను ఉచితంగా అందించడం సాధ్యమవుతుంది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)











స్వచ్ఛ రాజకీయాలు, వార్డు స్థాయి అధికారాలతో నగర సమగ్రాభివృద్ధి ఎజెండాతో 'వన్ హైదరాబాద్' కూటమిగా హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసిన లోక్‌సత్తా పార్టీ, సీపీఎం, సీపీఐ, ఎంసీపీఐ, ఎంబీసీ జేఏసీ ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో పాల్గొన్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, ఆయా పార్టీల నేతలు, కార్పొరేటర్ అభ్యర్థులు



## ఢంకా బజాయించి కులం పేర్లను తొలగించుకోండి, కులాంతర వివాహాలు చేసుకోండి

కులం పేర్లని, కులం పేరును సూచించే తోకలని సగర్వంగా, బహిరంగంగా, ఢంకా బజాయించి తొలగించుకోవాలని ఈ దేశ యువతకు విజ్ఞప్తి చేస్తున్నాను. కులం కారణంగా కుదిర్చే పెళ్లిళ్ళని నిర్మొహమాటంగా తిరస్కరించండి. కుల సంకెళ్లను తెంచుకోండి, మీలా మీరు ఉండండి, మీ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని రూపొందించుకోండి. వ్యక్తిత్వం నచ్చితే కులం, మతం జానేదో అంటూ స్వేచ్ఛగా వివాహం చేసుకోండి. భవిష్యత్తు భారతదేశానికి మీరు చేయగలిగే గొప్ప సేవ ఇది.

- జయప్రకాష్ నారాయణ్

Posting Date 07-02-2016

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on February 1st 2016




**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad